



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి దుర్గేష్

యూరియా కేటాయింపు పారదర్శకత కోసం జేసీ ఆధ్వర్యంలో కమిటీ : కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం రూరల్, సెప్టెంబరు9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో యూరియా కేటాయింపును పారదర్శకంగా నిర్వహించేందుకు జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేస్తున్నట్టు కలెక్టర్ ప్రశాంతి తెలిపారు. మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో సమన్వయ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కమిటీలో వ్యవసాయ, సహకార, ఉద్యానవన, పశుసంవర్థక శాఖాధికారులు, మార్క్‌ఫెడ్ డీఎం సభ్యులుగా ఉంటారన్నారు. ఎంత యూరియా అవసరమో కమిటీ సిఫారసు చేస్తుందని, ఆమేరకు కేటాయింపులు జరుగుతాయన్నారు. కేటాయింపు తరువాత నిల్వలను సహాయ రిజిస్ట్రార్ తప్పనిసరిగా తనిఖీ చేయాలన్నారు. ప్రతి రైతు సేవా కేంద్రాల వారీగా రికార్డులు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. యూరియా సక్రమంగా రైతు సేవా కేంద్రాలకు చేరిందా లేదా అన్నది వ్యవసాయాధికారి పరిశీలించాలన్నారు. సరఫరా చేసిన యూరియా వినియోగాన్ని వ్యవసాయ సహాయకులు తనిఖీ చేసి కనీసం 10 శాతం క్షేత్ర స్థాయిలో నిర్ధారణ జరపాలని ఆదేశించారు. అలానే ఒక రైతు సేవా కేంద్రం నుంచి మరొక కేంద్రానికి యూరియా తరలించాలంటే మండల వ్యవసాయాధికారి అనుమతి తప్పనిసరి అని స్పష్టంచేశారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు, జిల్లా సహకార అధికారి ఎం. వెంకటరమణ, ఉద్యాన శాఖ అధికారి ఎస్.మల్లిఖార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

నిడదవోలు సమగ్రాభివృద్ధే ధ్యేయం : మంత్రి దుర్గేష్

నిడదవోలు, సెప్టెంబరు 9, (ఆంధ్రజ్యోతి): నిడదవోలు సమగ్రాభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నానని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫి శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. మంగళవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిడదవోలు శాసనసభ్యునిగా ఏడాదికాలంలో సుమారు రూ.300 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని, మరో రూ.150 కోట్ల పనులు జరుగుతున్నాయన్నారు. నిడదవోలు పట్టణంలో రూ.105.85 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. మునిసిపాలిటీ సాధారణ నిధుల నుంచి రూ.15.75 కోట్ల నిధులతో 240 అభివృద్ధి పనులు ప్రారంభించగా ఇప్పటికే రూ.8.12 కోట్ల నిధులతో 187 పనులు పూర్తి చేశామన్నారు. 15వ ఆర్థిక సంఘం ద్వారా రూ.4.50 కోట్లు విడుదల కాగా, వీటి ద్వారా వ్యర్థాల నిర్వహణ, తాగునీటి సరఫరా, డ్రైన్స్ శుభ్రత పనులు జరుగుతున్నాయన్నారు. పట్టణంలో ఉన్న 30 పడకల ఆసుపత్రిని వంద పడకల ఆసుపత్రిగా తీర్చిదిద్దుతామని, ఇప్పటికే ఆధునికీకరణ పనులు జరుగుతున్నాయన్నారు. ప్రభుత్వంతో చర్చించి 2024లో ఎర్రకాలువ ముంపునకు గురైన 3071.41 హెక్టార్లలో పంట నష్టపోయిన 4631 మందికి 5.22 కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీ విడుదల చేయించామన్నారు. పర్యాటక శాఖామంత్రిగా అఖండ గోదావరి ప్రాజెక్టులో నిడదవోలును అంతర్భాగం చేసి రూ.4 కోట్లతో పర్యాటక రంగ అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. మునిసిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ పాల్గొన్నారు.

కొద్దిరోజులు.. ఆగుదాం!



- వాహనాలపై జీఎస్టీ తగ్గింపు ఫలితం
- నిలిచిన కార్లు, ద్విచక్ర, త్రిచక్ర వాహనాల కొనుగోళ్లు
- ముందస్తు బుకింగ్‌లు
- 22 నుంచి కొనేందుకు ఏర్పాట్లు
- విజయదశమికి భారీగా అమ్మకాలు జరిగే అవకాశం

వాహనాలపై జీఎస్టీ తగ్గిస్తూ కేంద్రం తీసుకున్న నిర్ణయంతో కొనుగోళ్లు నిలిచిపోయాయి. ఇక కొద్ది రోజులే కదా వేచి చూద్దాం అనే ధోరణి, ఆపై విజయదశమి దగ్గరగా ఉండడంతో అప్పుడు కొందామనే ఆలోచనతో అందరూ బ్రేక్ ఇచ్చేశారు. ఫలితంగా కేంద్రం ప్రకటన వచ్చిన నాటి నుంచి కార్లు, ద్విచక్ర, త్రిచక్ర వాహనాలు దాదాపుగా నిలిచిపోయి షోరూంల్లో సందడి కనిపించడం లేదు. ఈ సమయంలోనే పలు వాహన కంపెనీలు ఆఫర్లపై ఆఫర్లు ప్రకటిస్తూ వినియోగదారులను ఆకట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి.

(ఆంధ్రజ్యోతి-పిఠాపురం)

జీఎస్టీ సంస్కరణల్లో భాగంగా కేంద్ర ప్రభుత్వం చేసిన ప్రకటనతో అన్ని రకాల వాహనాల ధరలు తగ్గనున్నాయి. జీఎస్టీ తగ్గింపు నిర్ణయం ఈనెల 22వ తేదీ నుంచి అమలుల్లోకి రానున్న నేపథ్యంలో ప్రస్తుతం వాహనాల కొనుగోలు చేయాలని భావించిన వారంతా తమ నిర్ణయాలను వాయిదా వేసుకున్నారు. ఇప్పటికే అన్ని రకాల కార్లు, ద్విచక్ర వాహనాల ధరలను తగ్గిస్తున్నట్టు కంపెనీలు ప్రకటించాయి. ఒకటి రెండు కార్ల కంపెనీలు పోటీకి తెరలేపుతూ జీఎస్టీ తగ్గింపును ముందస్తుగానే వినియోగదారులకు వర్తింపజేస్తామంటూ ప్రకటనలు ఇస్తూ ఆకట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఇక ద్విచక్ర వాహనాలతోపాటు కార్లు, ఎస్‌యూవీలు ఇతర వాహనాలపై విధించే జీఎస్టీని తగ్గిస్తున్నట్టు కేంద్రం ప్రకటించింది. ఇందులో భాగంగా 350 సీసీ, అంతకంటే తక్కువ కెపాసిటీ కలిగిన ద్విచక్ర వాహనాలపై ప్రస్తుతం ఉన్న 28 శాతం జీఎస్టీని 18 శాతానికి తగ్గించారు. దీంతో వాహనాల ధరలు రూ.8 వేల నుంచి రూ.23 వేల వరకూ తగ్గే అవకాశం ఉంది. అలాగే 1200 సీసీ అంతకంటే తక్కువ సామర్థ్యం కలిగిన పెట్రోల్, పెట్రోల్ హైబ్రిడ్, ఎల్‌పీజీ, సీఎన్‌జీ కార్లు, 1500 సీసీలోపు ఉన్న డీజిల్, డీజిల్ హైబ్రిడ్ కార్లపై ఇప్పటివరకూ 28 శాతం జీఎస్టీ ఉండగా దానిని 18 శాతానికి తగ్గించారు. ఇదే రీతిలో మధ్యశ్రేణి, ఉన్నతశ్రేణి ఎస్‌వీయూలపై ఇప్పటివరకూ జీఎస్టీ 28 శాతం, సెస్‌లతో కలుపుకుని 45 నుంచి 50 శాతం వరకూ పన్నులు చెల్లించాల్సి వచ్చేది. జీఎస్టీని 28 నుంచి 40 శాతానికి పెంచారు. సెస్‌లను మినహాయించారు. దీంతో పన్నులు 5-10 శాతం వరకూ తగ్గనున్నాయి. ఈ నేపథ్యంలో కార్ల ధరలు కనిష్ఠంగా రూ.30 వేల నుంచి గరిష్ఠంగా రూ.4.50 లక్షల వరకూ తగ్గనున్నాయి. ఇదే విషయాన్ని తెలుపుతూ మారుతి సుజుకి, టాటా మోటార్స్, హ్యుందయ్, ఎంజీ, కియా, హోండా తదితర కార్ల కంపెనీలు ఇప్పటికే అధికారికంగా ప్రకటనలు కూడా విడుదల చేశాయి.

అమ్మకాలకు బ్రేక్

కేంద్రం జీఎస్టీ పన్నుల శ్లాబుల్లో మార్పులు చేస్తుందనే సమాచారం వచ్చిన నాటి నుంచి వాహనాలు కొనుగోళ్ల మందగించాయి. అధికారిక ప్రకటన వచ్చిన తర్వాత దాదాపుగా అమ్మకాలు నిలిచిపోయాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా గల కార్లు, ద్విచక్రవాహనాల షోరూంల్లో కొద్ది రోజులుగా కొనుగోళ్ల జరగడం లేదు. ఈనెల 21వ తేదీ వరకూ ఇదే పరిస్థితి కొనసాగనున్నది. 22వ తేదీ నుంచి జీఎస్టీ తగ్గింపు అమల్లోకి వస్తున్న నేపథ్యంలో ఆ తర్వాతే కొనుగోళ్ల జరపాలని వినియోగదారులు భావిస్తుండడమే ఇందుకు కారణంగా చెబుతున్నారు. సాధారణంగా కాకినాడ జిల్లాలో ప్రతి నెలా సగటున 2 వేల నుంచి 3 వేల వరకూ ద్విచక్ర వాహనాలు, 300-450 వరకూ కార్లు విక్రయాలు జరుగుతాయి. తూర్పుగోదావరి జిల్లాలో 2,200 నుంచి 2,800 వరకూ ద్విచక్ర వాహనాలు, 300-500 వరకూ కార్లు, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ప్రతి నెలా 1800 నుంచి 2,500 వరకూ ద్విచక్ర వాహనాలు, 300నుంచి 500 వరకూ కార్లు విక్రయాలు జరుగుతాయి. విజయదశమి, దీపావళి, సంక్రాంతి, ఉగాది తదితర పండుగల సమయాల్లో వీటి విక్రయాలు రెట్టింపుపైగా ఉంటాయి.

ముందస్తు బుకింగ్‌లపై దృష్టి

ఇప్పుడు ద్విచక్ర, త్రిచక్ర వాహనాలు, కార్ల కంపెనీలతోపాటు షోరూంల నిర్వాహకులు కొనుగోలుకు ఆసక్తి చూపించే వారి వద్ద నుంచి ముందస్తు బుకింగ్‌లు కోసం ప్రయత్నిస్తున్నాయి. ఇందుకోసం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పలు షోరూంలు ఆఫర్లు ప్రకటించాయి. తమ వద్ద కొనుగోలు చేసే వారికి యాక్సెసరీలు ఉచితంగా ఇస్తామంటూ ఆకట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఒకటి రెండు కార్ల కంపెనీలు తమ కార్లు ఇప్పుడు కొనుగోలు చేసినా జీఎస్టీ తగ్గింపు వర్తింపజేస్తామంటూ ప్రకటనలు జారీ చేశాయి. సాధ్యమైనంత వరకూ ఎక్కువమందికి తమ వాహనాలు విక్రయించేందుకు సంప్రదింపులు చేస్తున్నారు.

విజయదశమికి ఫుల్‌జోష్

ఈసారి విజయదశమికి వాహనాల కొనుగోళ్ల అధికంగా ఉంటాయని భావిస్తున్నారు. గతంతో పోల్చుకుంటే ఇప్పుడు అమ్మకాలు 100 శాతంపైగా పెరుగుతాయని చెబుతున్నారు. ఎప్పటి నుంచో బైక్‌లు, కార్లు కొనుగోలు చేయాలని భావించేవారు ఈనెల 22వ తేదీ నుంచి తగ్గను న్న ధరలతో కొనేందుకు మొగ్గు చూపే అవ కాశం ఉంది. విజయదశమి పర్వదినాన వాహనాలు కొనుగోలు చేస్తే కలిసి వస్తుందనే నమ్మకంగా ఎక్కువమంది ఆ రోజున వాహనాలు కొనుగోలు చేస్తూ ఉంటారు. ఈ సెంటిమెంట్, ధరల తగ్గడం అమ్మకాలు పెరిగేందుకు దోహదం చేస్తాయని వాహన షోరూంల ప్రతినిధులు చెప్పారు. ఇప్పటికే పలువురు వాహనాల ధరలు ఏ మేర తగ్గాయి, ఎటువంటి ఆఫర్లు ప్రకటించారు తదితర విషయాలను ఆరా తీస్తున్నారని వారు తెలిపారు. మార్కెట్‌లో పోటీ తట్టుకునేందుకు ఆఫర్లు ప్రకటించక తప్పదని వారు చెబుతున్నారు. మరోవైపు వాహనాలు కొనుగోలు చేయాలని భావిస్తున్న వారు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో రేట్లు ఎక్కడ తక్కువగా ఉన్నాయి, ఏయే ఆఫర్లు ఇస్తున్నారు తెలుసుకుని మరీ కొనాలని భావిస్తుండడం విశేషం. జీఎస్టీ తగ్గింపు వల్ల భవిష్యత్తులో విక్రయాలు పెరిగే అవకాశమున్నా ప్రస్తుతం మాత్రం నిలిచిపోయాయి.

రూ. లక్ష.. దాటేసి..



10 గ్రా.బంగారం 22 క్యారెట్ రూ.1,01,100.. గత జనవరిలో రూ.71,500

కిలో వెండి ధర రూ.1లక్షా 28 వేల 900... జనవరి నాటి ధర రూ.88,400

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

బంగారం ధరలు మిడిసి పడుతున్నాయి. ఈ ఏడాది జనవరి నుంచి బాగా పెరుగుదల మొదలైంది. ఇక తగ్గేదేలే అన్నట్టు ముందుకు పోతోంది. అపుడప్పుడు అటూఇటూ వెనకడుగు వేసినట్టు కనిపించినా, మళ్లీ పరుగుపెడుతోంది. జనవరి నుంచి ఇప్పటికి సుమారు ఎనిమిది నెలల కాలంలో 22 క్యారెట్ బంగారం ధర ఏకంగా రూ.30 వేలు అదనంగా పెరిగింది. 24 క్యారెట్ బంగారం 10 గ్రాముల ధర సుమారు 33 వేల వరకూ పెరుగుదల కనిపిస్తోంది. వెండి ధర కూడా విపరీతంగా పెరిగింది. వెండి ధర సుమారు 40 వేల వరకూ పెరిగిపోయింది. మంగళవారం రాజమండ్రి మార్కెట్‌లో బంగా బంగారం 22 క్యారెట్ 10 గ్రాములు ధర రూ.లక్ష దాటేయడం గమనార్హం. 24 క్యారెట్ బంగారం ధర ఎపుడో రూ.లక్ష దాటేసిన సంగతి తెలిసిందే. ఎక్కువ మంది 22 క్యారెట్ బంగారమే కొంటారు. వస్తువులు కూడా ఇవే ఉంటాయి. ఇవాళ 10 గ్రాముల 22 క్యారెట్ బంగారం రూ.1,01,100 కి చేరింది. అంటే కేవలం ఒక గ్రాము బంగారం 10వేల110 కావడం గమనార్హం. సామాన్యుడు చిన్న బంగారం వస్తువును కూడా కొనుగోలు చేసుకునే పరిస్థితి లేనట్టే. 10 గ్రాముల 24 క్యారెట్ ధర రూ.1,10,290 చేరింది. ఇదంతా రికార్డు స్థాయి ధరలు. ప్రజలకు అందుబాటు కాని ధరలు. పేద, మధ్యతరగతి ప్రజలు బంగారం అంటే కలలోనే చూసే వస్తువుగా మారిపోయింది. ఇంతవరకూ బంగారం కొనుగోలు చేసిన వారి పంట బాగా పండినట్టే. జనవరికి ముందుకు కొనుగోలు చేసినవారికే బాగా మిగిలినట్టే చెప్పవచ్చు. బ్యాంకుల్లో రుణాలు కూడా అధికంగా బాగా వస్తాయి.

● వెండిదీ అదే బాట

ప్రస్తుతం రాజమహేంద్రవరం మార్కెట్ కిలో వెండి ధర రూ.1 లక్షా 28వేల 900గా ఉంది. ఇది ఇలా ఎంత ధరకు పెరిగిపోతుందో చెప్పలేం. ఒకవేళ తగ్గితే వందో రెండొందలో తగ్గుతోంది. పెరిగితే వేలల్లో పెరిగిపోతోందని వినియోగదారులు వాపోతున్నారు. జనవరి 1న వెండి ధర కిలో 88,400గా ఉండగా ఆ తర్వాత ధర భారీగా పెరిగిపోయింది. జనవరి నుంచి ఇప్పటివరకూ వెండి ఏకంగా రూ.40,500 పెరిగింది. డబ్బున్నవారు బంగారం, వెండి కొనడానికి వెనకాడకపోయినా, సామాన్యులు మాత్రం కళ్లు తేలేస్తున్నారు.

పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టిపెట్టాలి



సీసీ కెమెరాల నిఘా పెంచాలి

జీజీహెచ్ అధికారుల సమీక్షలో కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు9, (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం ప్రభుత్వ బోధనాసుపత్రి (జీజీహెచ్)లో ఎల్లపుడూ పరిశుభ్రత కొనసాగేలా అధికారులు ప్రత్యేక దృష్టిపెట్టాలని, దొంగతనాలు అరికట్టడానికి సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. నవజాత శిశువుల ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (ఎన్ఐసీయూ) ఏర్పాటును వేగవంతం చేయాలని స్పష్టంచేశారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లో జీజీహెచ్ అధికారులతో సమావేశమై కొత్త విభాగాల ఏర్పాటు, ఆసుపత్రిలో మౌలిక సదుపాయాల అభివృద్ధి, పారిశుధ్య పరిరక్షణ వంటి అంశాలపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భద్రతా సిబ్బంది లోనికి వచ్చేవారి, బయటకు వెళ్లేవారి వివరాలు రిజిస్టర్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. భద్రతా సంస్థలు ఈ బాధ్యతను పూర్తిస్థాయిలో నిర్వర్తించేలా పర్యవేక్షణ వ్యవస్థ ఏర్పాటు చేయాలన్నారు. జీజీహెచ్ లేఅవుట్ మాస్టర్ ప్లాన్ ప్రకారం ఆసుపత్రి ప్రధాన ద్వారం వద్ద ఆర్చ్ నిర్మించాలని, ఆసుపత్రికి ఒకటి లేదా రెండు మాత్రమే ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇతర మార్గాలను బారికేడ్లు వేసి మూసివేయాలన్నారు. అవుట్‌పేషెంట్ సేవలు సమయానికి ప్రారంభమయ్యేలా టోకెన్ కౌంటర్లు పెంచాలని, న్యూరో సర్జరీ విభాగానికి అవసరమైన తాత్కాలిక సాంకేతిక నిపుణులను నియమించి సేవలు అందుబాటులోకి తేవాలన్నారు. మృతదేహాలను తరలించడానికి మహాప్రస్థానం వాహనాలతోపాటు ప్రైవేటు వాహనాలనూ ఎంపానెల్ చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమీక్షలో ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యలక్ష్మి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.భాస్కర్‌రెడ్డి, ఆర్ఎంవో డాక్టర్ ఆర్‌వీ సుబ్బారావు పాల్గొన్నారు.

మాటామాటా పెరిగి..



కొవ్వూరులో ఘర్షణ పడుతున్న తెలుగుదేశం, జనసేనకు చెందిన యువకులు, కార్యకర్తలు

- టీడీపీ, జనసేనలకు చెందిన యువకుల మధ్య ఘర్షణ.. కలబడి కొట్లాట
- సముదాయించిన టీడీపీ నేతలు, ఎమ్మెల్యే.. సర్దుబాటు చేసిన పోలీసులు
- ఇది కుర్రాళ్ల ఘర్షణ.. కూటమి పార్టీలకు ఆపాదించడం తగదు : ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): కొవ్వూరు టీడీపీ కార్యాలయంలో జనసేన, టీడీపీ కార్యకర్తల మధ్య జరిగిన ఘర్షణ కొద్దిపాటి ఉద్రిక్తతకు దారితీసింది. అయితే యువకుల మధ్య జరిగిన ఈ ఘర్షణను కూటమి పార్టీల వివాదంగా ఆపాదిస్తూ కొందరు ప్రచారానికి తెరదీశారు. కొవ్వూరు నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో సోమవారం రాత్రి టీడీపీ, జనసేన నాయకులు పార్టీ విషయాలపై చర్చించుకుంటున్నారు. ఈ సందర్భంలో పట్టణానికి చెందిన ఎం.శివకుమార్, బి.అనిల్ మద్యం సేవించి వచ్చారు. నాయకులు మాట్లాడుకుంటుండగా అక్కడకు వచ్చిన శివకుమార్ టీడీపీ, జనసేన గొడవలు మనకెందుకు అంటూ జోక్యం చేసుకోవడంతో అక్కడే కూర్చున్న జనసేన నాయకుడు, ఏఎంసీ డైరెక్టర్ గంగుమళ్ల స్వామి ఒక్కసారిగా పైకిలేచి శివకుమార్‌పై జనసేనని తిడతావా అంటూ చేయి చేసుకున్నాడు. దీంతో అక్కడున్న టీడీపీ కార్యకర్త, అతని అనుచరులు మా అన్నయ్యపై చేయి చేసుకుంటావా అంటూ ఒకరికొకరు కలబడ్డారు. అక్కడే ఉన్న టీడీపీ, జనసేన నాయకులు ఇరువర్గాలను వారించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాలను పంపించివేశారు. పార్టీ కార్యాలయం నుంచి స్వామిని ఇంటి వద్ద కారు దింపుతామంటే వినకుండా నడిచి దొమ్మేరు బయలుదేరాడు. కొవ్వూరు బస్టాండ్ సెంటర్‌లో యువకులు మళ్లీ స్వామిని అడ్డగించడంతో పోలీసులు ఇరువర్గాలను చెదరగొట్టారు. స్వామిని పోలీసు వాహనంలో దొమ్మేరు తరలించారు. అనంతరం దొమ్మేరు గ్రామంలో స్వామి ఇంటి వద్ద టెంటువేసుకుని జనసేన నాయకులతో బైఠాయించి న్యాయం చేయాలంటూ నిరసన వ్యక్తంచేశారు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు సంఘటనా స్థలానికి చేరుకుని జనసేన నాయకులతో మాట్లాడారు. సమస్యలుంటే పెద్దల సమక్షంలో మాట్లాడి సరిచేస్తానని హామీ ఇచ్చారు. మంగళవారం ఉదయం జనసేన నాయకులు నిడదవోలులో పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్‌ను కలిసి జరిగిన సంఘటనను వివరించారు. దీనిపై ఇరుపార్టీల పెద్దల సమక్షంలో కూర్చుని మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తామని మంత్రి దుర్గేష్ చెప్పినట్టు సమాచారం. కాగా జనసేన నాయకుడు, ఏఎంసీ డైరెక్టర్ గంగుమళ్ల స్వామి మాట్లాడుతూ "గత మూడు రోజుల కిందట దొమ్మేరులో ఎల్‌వోసీ చెక్కు అందించడానికి ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, నాయకులు వచ్చారు. ఎమ్మెల్యే గ్రామానికి వచ్చిన తరువాత సమాచారం నాకు అందించారు. ఈ విషయం మాట్లాడడానికి సోమవారం రాత్రి స్నేహితుడిని తీసుకుని టీడీపీ పార్టీ కార్యాలయానికి వెళ్లాను. ఇదే విషయమై అక్కడ నాయకులతో మాట్లాడుతుండగా శివ అనే వ్యక్తి వచ్చి దుర్భాషలాడాడు. దీంతో అతని వెనక్కి గెంటాను. దీంతో అక్కడే ఉన్న టీడీపీ కార్యకర్తలు నాపై దాడిచేశారు. ఈ విషయాన్ని పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్‌కు తెలియజేశా. నియోజకవర్గ ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, అచ్చిబాబుల సమక్షంలో మాట్లాడతానని ఆయన తెలియజేశారని" స్వామి చెప్పారు.

మాట్లాడి సరిచేస్తాం..

కుర్రాళ్ల మధ్య జరిగిన ఘర్షణ ఇది. కొందరు కూటమి పార్టీలకు ఆపాదించడం సరికాదు. ఈ గొడవకు టీడీపీ, జనసేన పార్టీలకు ఎటువంటి సంబంధం లేదు. ఏదైనా సమస్యలుంటే ఇరుపార్టీల పెద్దల సమక్షంలో మాట్లాడి సరిచేస్తాం.

- ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

అమ్మా! కాలువలోకి దూకేస్తున్నా..

- వేమగిరి వద్ద కాలువలోకి దూకిన బాలుడు
- ఆచూకీ కోసం గాలింపు



జీవన్

కడియం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అమ్మా! నేను కాలువలోకి దూకేస్తున్నానంటూ ఓ బాలుడు తన పుట్టినరోజునాడు.. తల్లికి ఫోనుచేసి కాలువలోకి దూకిన ఉదంతం వేమగిరిలో జరిగింది. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం.. కడియం మండలం బుర్రిలంక గ్రామానికి చెందిన పెదవేగి శ్రీను కుటుంబం ప్రస్తుతం వేమగిరి జగన్ కాలనీలో నివాసం ఉంటోంది. వీరి కుమారుడు జీవన్ కుమార్(16) కడియంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. మంగళవారం సాయంత్రం వేమగిరి కాలువ కాలిబాట వంతెన వద్దకు వెళ్లాడు. తల్లి గౌరీకి ఫోను చేసి నేను కాలువలోకి దూకేస్తున్నాను.. మీరు జాగ్రత్త! అంటూ కాలువలోకి దూకేశాడు. దీంతో జీవన్‌కుమార్ తల్లి స్పృహతప్పి పడిపోయింది. జీవన్ కాలువలో పడిపోయాడన్న విషయం తెలుసుకున్న స్థానికులు, స్నేహితులు అక్కడికి చేరుకున్నారు. జీవన్‌కుమార్ ఆచూకీ కోసం గాలిస్తున్నారు. కాగా తమకు ఎటువంటి ఫిర్యాదు రాలేదని సీఐ తెలిపారు.




రాజమహేంద్రవరంలో నిరసన వ్యక్తం చేస్తున్న వైసీపీ నాయకులు, కార్యకర్తలు

వైసీపీ అన్నదాతపోరుకు రైతుల కొరత

రాజమహేంద్రవరంలో ఆందోళన.. కొవ్వూరులో ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం

రాజమహేంద్రవరం,సెప్టెంబరు9 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అన్నదాత పోరుకు రైతులు కరవయ్యారు. రైతుల నుంచి స్పందన కనిపించలేదు. వైసీపీ మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, వైసీపీకి చెందిన నాయకులు మాత్రమే హాజరయ్యారు. యూరియాతోపాటు ఎరువుల కొరత ఉందని, ఎరువులు బ్లాక్ మార్కెట్ చేస్తున్నారని ఆరోపిస్తూ నేతలు విమర్శలు చేశారు. రాజమహేంద్రవరంలో రాజానగరం మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఇంటి వద్ద మాజీ మంత్రి చెల్లుబోయిన వేణు, మాజీ ఎమ్మెల్యేలు జక్కంపూడి రాజా, డాక్టర్ సత్తి సూర్యానారాయణరెడ్డి, సీనియర్ నేతలు డాక్టర్ గూడూరి శ్రీనివాసరావు, చందన నాగేశ్వర్, మేడపాటి షర్మిళారెడ్డి తదితర నాయకులు పలువురు వైసీపీ కార్యకర్తలు, చోటామోటా నేతలతో కలసి ప్రదర్శనగా ఆర్డీవో కార్యాలయానికి వెళ్లి వినపత్రం ఇవ్వాలని బయలుదేరగా, పోలీసులు అడ్డుకున్నారు. సెక్షన్ 30 అమలులో ఉన్నందున ఇలా ఎక్కువమంది వెళ్లడానికి వీలులేదని, నలుగురైదుగురు వెళ్లి వినతిపత్రం ఇవ్వవచ్చుని చెప్పారు. అయినా దూసుకెళ్లడానికి ప్రయత్నించగా, పోలీసులు అడ్డుకోవడంతో రోడ్డు మీదే బైఠాయించి, ప్రభుత్వం, సీఎం చంద్రబాబుకు వ్యతిరేకంగా నినాదాలిచ్చారు. నలుగురైదుకు వెళ్లి ఆర్డీవోకు వినతిపత్రం ఇచ్చే అవకాశం ఉన్నప్పటికీ ఎవరూ వెళ్లకపోవడం గమనార్హం. కొవ్వూరులో మాజీ మంత్రి తానేటి వనిత, మాజీ ఎమ్మెల్యేలు తలారి వెంకట్రావు, జి.శ్రీనివాసనాయుడు ఆందోళనచేసి ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రమిచ్చారు.



సద్గురు జగ్గీవాసుదేవ్ సమక్షంలో

నేటి నుంచి కాకినాడ గాంధీభవన్‌లో

యోగా శిక్షణ

ఈశా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏడు రోజులు తరగతులు

కలెక్టరేట్ (కాకినాడ), సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రామకృష్ణారావు పేటలోని గాంధీభవన్‌లో బుధవారం నుంచి ఈ నెల 16వ తేదీ వరకు ఈశా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక యోగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్టు ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు. ప్రాచీన యోగశాస్త్రాల ప్రకారం ఇన్నర్ ఇంజనీరింగ్ మానవుని సంపూర్ణ శ్రేయస్సుకు బాటలు వేస్తోందని వారు పేర్కొన్నారు. ప్రతిరోజూ ఉదయం 6 నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 6 నుంచి రాత్రి 9 గంటల వరకు రెండు సెషన్లుగా శిక్షణ తరగతులు జరుగుతాయన్నారు. బుధవారం ఉదయం 6 నుంచి 7 గంటల వరకు, సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు ఉచిత పరిచయ కార్యక్రమం ఉంటుందన్నారు. దీనికి ఎవరైనా హాజరు కావచ్చన్నారు. మరిన్ని వివరాలకు 96181 18529, 6301756244 నెంబర్లను సంప్రదించాలన్నారు.

కాకినాడ జీజీహెచ్‌కు రూ.23 కోట్ల నిధులు

జీజీహెచ్ (కాకినాడ), సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) కాకినాడ జీజీహెచ్‌లో బయో మెడికల్ పరికరాలు, ఫర్నిచర్ కొనుగోలుకు నిధులు మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు వైద్య-ఆరోగ్య శాఖ జీవో ఆర్టీ నెం.583 విడుదల చేసింది. కాకినాడ, గుంటూరు జీజీహెచ్‌లకు కలిపి బయోమెడికల్ ఎక్విప్‌మెంట్, ఫర్నీచర్‌లకు రూ.51కోట్లు నిధులు విడుదల చేసింది. ఇందులో రూ.23 కోట్ల వరకు కాకినాడ జీజీహెచ్‌కు వచ్చే అవకాశం ఉంది.

ఇక 'స్పీడ్'గా...

- రిజిస్టర్ పోస్టు సేవలకు విరామం
- వచ్చే నెల ఒకటో తేదీ నుంచి స్పీడ్ పోస్టులో విలీనం
- తపాలా శాఖలో కీలక పరిణామం



(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

తంతి తపాలా... ఉత్తరప్రత్యుత్తర సేవలలో ఏళ్ల తరబడి ప్రజలతో విడదీయరాని బంధాన్ని కొనసాగిస్తున్న సంస్థ. మెయిల్స్, మొబైల్స్, ఇంటర్నెట్ సేవలు అందుబాటులోకి రాని రోజుల్లో మారుమూల ప్రాంతాల్లో ఉన్న వారికి సైతం సమాచారాన్ని చేరవేసే ఏకైక సమాచార వ్యవస్థ ఈ తంతి తపాలాయే. టెలిగ్రామ్, మనియార్డర్... ఇలా పలు రకాల సేవలతో ప్రజలకు చేరువైన ఈ సంస్థ కాలానుగుణంగా మారుతూ వస్తోంది. ప్రైవేటు సంస్థలకు దీటుగా సమాచార సేవ కొనసాగిస్తోంది. పౌర, బ్యాంకింగ్ సేవలను సైతం అందిస్తోంది. కీలకమైన పలు మార్పులు ఈ శాఖలో చోటుచేసుకుంటున్నాయి. దీంట్లో భాగంగా బ్రిటిష్ కాలం నాటిదైన రిజిస్టర్ పోస్టును స్పీడ్ పోస్టు విభాగంలో విలీనం చేయాలని భారత తపాలా శాఖ నిర్ణయించింది. తొలుత సెప్టెంబరు ఒకటో తేదీ నుంచి దీనిని అమలు చేస్తామని చెప్పింది. అయితే వివిధ కారణాలతో అక్టోబరు ఒకటో తేదీ నుంచి ఇకపై పోస్టల్ శాఖలో రిజిస్టర్ పోస్టు కనుమరుగు కానుంది.

అప్పట్లో అట్లుండేది..

పోస్టల్ శాఖలో రిజిస్టర్ పోస్టుది ఎంతో ఘన చరిత్ర ఉంది. ఈ సేవలను అప్పటి బ్రిటిష్ చక్రవర్తి లార్డ్ డల్‌హౌసీ ప్రవేశపెట్టారు. అప్పటి ఇండియన్ పోస్టాఫీస్ చట్టంతో రిజిస్టర్ పోస్టు సేవలు మొదలయ్యాయి. అంతకు ముందు 1766లో వారెన్ హేస్టింగ్ ఈస్టిండియా కంపెనీ ఆధ్వర్యంలో 'కంపెనీ మెయిల్' ప్రారంభమైంది. దాదాపు 171 సంవత్సరాల పాటు రిజిస్టర్ పోస్టు సేవలందించింది. ముఖ్యమైన పత్రాలను, వస్తువులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చింది. ముఖ్యంగా లీగల్ నోటీసులు, అపాయింట్‌మెంట్ లెటర్లు, బ్యాంకింగ్ సంబంధిత పత్రాలు వంటివాటిని పంపడానికి ఇది ఎంతగానో ఉపయోగపడింది. పంపించిన వస్తువు, పత్రం అవతలివారికి చేరినట్టు రసీదు పొందడం దీని ప్రత్యేకత.

వేగవంతమైన డెలివరీకి ప్రాధాన్యం..

పోస్టల్ సేవల ఆధునికీకరణలో భాగంగా తపాలా శాఖ రిజిస్టర్ పోస్టు విలీనంపై నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. దేశీయ పోస్టల్ సేవలను క్రమబద్ధీకరించడం, పనితీరు మెరుగుపరచుకోవడం, ట్రాకింగ్ వ్యవస్థను బలోపేతం చేయడం వంటివి విలీన ప్రక్రియకు కారణంగా తెలుస్తోంది. స్పీడ్ పోస్టు అనేది వేగవంతమైన డెలివరీకి ప్రాధాన్యమిస్తోంది. ఇప్పుడు రిజిస్టర్ పోస్టుల సేవలు స్పీడ్‌పోస్టులో విలీనమైతే డెలివరీలు మరింత వేగవంతమవుతాయి. ముఖ్యంగా స్పీడ్ పోస్టు ద్వారా మీ పార్సిల్ ఎక్కడికి వెళ్లిందో ఆన్‌లైన్‌లో చెక్ చేసుకునే సౌకర్యం సైతం ఉంటుంది. ఈ ఆప్షన్ రిజిస్టర్ పోస్టులో లేదు. అలాగే ఒకే సేవ ఉండడం వల్ల పోస్టల్ సేవలు మరింత సులువు అవుతాయి. సిబ్బందిపై పనిభారం కూడా తగ్గుతుంది. అయితే ప్రభుత్వ శాఖలే ఎక్కువగా రిజిస్టర్ పోస్టు సేవలను వినియోగించుకునేవి. అన్నిరకాల ఉత్తర ప్రత్యుత్తరాలన్నీ రిజిస్టర్ పోస్టు ద్వారా చేసేవి. అందుకే ముందుగా పోస్టల్ శాఖ ప్రభుత్వ శాఖలకు ఈ విషయంపై సమాచారం అందించింది.

స్పీడ్ పోస్టు ధర తగ్గించాలి...

రిజిస్టర్ పోస్టును నిలిపివేస్తుండడంతో వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. స్పీడ్ పోస్టులో విలీనం చేస్తే రుసుం పెరుగుతుందని, అదనపు భారం తప్పదని భావిస్తున్నారు. రిజిస్టర్ పోస్టు చార్జీ రూ.26 ఉంటే, స్పీడ్ పోస్టు చార్జీ రూ.41 వరకు ఉంటుందంటున్నారు.

12న కాకినాడ రానున్న మంత్రి నాదెండ్ల

- కాకినాడ కలెక్టరేట్లో ఐదు జిల్లాల అధికారులతో సమీక్ష
- ఖరీఫ్‌లో ధాన్యం సేకరణ కార్యాచరణపై సమావేశం



కలెక్టరేట్ (కాకినాడ), సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఈనెల 12వ తేదీన కాకినాడ జిల్లాకు రానున్నారు. కాకినాడ కలెక్టరేట్లో ఆ రోజు ఉదయం 10 గంటలకు ఐదు జిల్లాల జాయింట్ కలెక్టర్లు, సివిల్ సప్లయిస్ అధికారులు, రైస్‌మిల్లర్లు, వ్యవసాయ, సహకార శాఖల అధికారులతో ఆయన సమావేశమవుతారు. ఉమ్మడి తూర్పు గోదావరిలోని మూడు జిల్లాలతో పాటు ఉమ్మడి పశ్చిమ గోదావరిలోని రెండు జిల్లాల్లో ఖరీఫ్ ధాన్యం సేకరణ కార్యాచరణపై మంత్రి నాదెండ్ల అధికారులతో ప్రత్యేకంగా సమీక్షిస్తారు. కాకినాడ జిల్లాలో గత ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 1.60 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించారు. గత ఏడాది రబీ సీజన్‌లో 1.40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని అధికారులు సేకరించారు. ఈ నేపథ్యంలో ఈఏడాది ఖరీఫ్ సీజన్‌లో 277 రైతు సేవా కేంద్రాల ద్వారా పెద్ద ఎత్తున ధాన్యం సేకరించేందుకు అధికారులు కార్యాచరణ రూపకల్పన చేస్తున్నారు. ఖరీఫ్ ధాన్యం సేకరణపై ఇప్పటికే కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనా, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజరు దేవుల నాయక్ ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు. మంత్రి నాదెండ్లతో వీరు ప్రత్యేకంగా సమీక్షించనున్నారు. సివిల్ సప్లయిస్ కమిషనర్ సౌరభ్‌గౌర్, కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్ మోహన్‌తో, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొంటారు.



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న సీనియర్ రీజనల్ డైరెక్టర్ డాక్టర్ అనురాధ

కీటక జనిత వ్యాధుల నివారణపై శిక్షణ

జీజీహెచ్(కాకినాడ) సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) నేషనల్ వెక్టర్ బోర్న్ డిసీజ్ కంట్రోల్ ప్రోగ్రాం (ఎన్‌వీబీడీసీపీ) కీటక జనిత వ్యాధుల నివారణపై కాకినాడ డీఎంహెచ్‌వో కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం ఒకరోజు శిక్షణ జరిగింది. ట్రాన్స్‌మిషన్ అసెస్‌మెంట్ సర్వే (టీఏఎస్-2) ఈ నెల 12 నుంచి 16 వరకు జరగనున్న నేపథ్యంలో సీనియర్ రీజనల్ డైరెక్టర్ డాక్టర్ ఎం.అనురాధ ఆధ్వర్యంలో వర్క్‌షాపు నిర్వహించారు. టీఏఎస్-2లో భాగంగా ఎంపిక చేసిన పాఠశాలల్లో 1, 2 తరగతుల పిల్లలకు ఫైలేరియా స్క్రీనింగ్ నిమిత్తం రక్త పరీక్షలు నిర్వహించడంపై రాష్ట్ర, జిల్లా అధికారులు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. డీఎల్ఏటీవో డాక్టర్ పి.ప్రభాకర్, జిల్లా మలేరియా అధికారి పి.విల్సన్, కోనసీమ జిల్లా డీఎంవో ఎన్.వెంకటేశ్వరరావు, ఎం.పార్వతీశం, ఎం.లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీ ఈఏపీసెట్ మూడో విడత కౌన్సెలింగ్ ప్రారంభం

- కాకినాడ ఆంధ్రా పాలిటెక్నిక్‌లో సహాయ కేంద్రం ఏర్పాటు
- రేపటి వరకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు అవకాశం

కాకినాడ రూరల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఇంజనీరింగ్ కళాశాలల్లోమొదటి, రెండు విడతల్లో భర్తీకాని సీట్లలో ప్రవేశాల కోసం ప్రభుత్వం మరో అవకాశం కల్పించింది. దీంతో ఏపీ ఈఏపీసెట్ మూడో విడత కౌన్సెలింగ్ మంగళవారం ప్రారంభమైంది. విద్యార్థులకు ఈ నెల 11వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు అవకాశం కల్పించారు. 12 వరకు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవచ్చు. 13న వెబ్ ఆప్షన్లు మార్పుచేసుకునేందుకు గడువునిచ్చింది. 15న విద్యార్థులకు సీట్లు కేటాయిస్తారు. 17లోపు విద్యార్థులు కళాశాలల్లో రిపోర్టు చేయాలి. 15వ తేదీ నుంచి తరగతులకు హాజరుకావాలి.

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కాకినాడ జగన్నాథపురంలోని ఆంధ్రా పాలిటెక్నిక్ (ఏపీటీ) కళాశాలలో సహాయ కేంద్రం ఏర్పాటు చేశామని సమన్వయకర్త, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.జనార్దనరావు తెలిపారు. తొలిరోజు 20మంది విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకుని ధ్రువపత్రాలను అప్‌లోడ్ చేశారు. విద్యార్థులకు ఏమైనా సందేహాలుంటే సహాయ కేంద్రంలో గానీ, 99123 42010 నెంబరును గానీ సంప్రదించాలని ఆయన సూచించారు.

రేపటి నుంచి అండర్-14, 17 బాలబాలికలకు క్రీడా పోటీలు

కార్పొరేషన్ (కాకినాడ), సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య అండర్-14, 17 బాలబాలికలకు ఈ నెల 11వ తేదీ నుంచి క్రీడా పోటీలు జరుగుతాయని నిర్వాహకులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 11న కాకినాడ డీఎస్ఏ మైదానంలో అండర్-14, 17 ఆర్చరీ, సపక్‌తక్రా, అండర్-17 ఖట్కా, 15న అండర్-14, 17 విభాగాల్లో సాఫ్ట్ టెన్నిస్, జోడో, షూటింగ్, ఫుట్‌బాల్ (అండర్-17), ఈ నెల 16న టెన్నిస్ (అండర్-14, 17), వెయిట్ లిఫ్టింగ్ (అండర్-17), జిమ్నాస్టిక్స్ (అండర్-14, 17, 19), 17న అండర్-14, 17 విభాగాల్లో టేబుల్ టెన్నిస్, రగ్బీ, కాకినాడ పీఆర్ హైస్కూల్లో నెట్‌బాల్, ఈ నెల 18న కాకినాడ డీఎస్ఏ మైదానంలో అండర్-14, 17 విభాగాల్లో స్విమ్మింగ్ అండ్ డైవింగ్, రెజ్లింగ్, ఫ్రీస్టైల్ అండ్ గ్రీకో రోమన్, స్క్వాష్, ఈ నెల 19న డీఎస్ఏలో మోడరన్ పెంటాథ్లాన్, (అండర్-17), అండర్-14, 17ల్లో సైక్లింగ్, కాకినాడ రాజాటాంక్ స్కేటింగ్ రింక్‌లో స్కేటింగ్, ఎన్టీఆర్ బీచ్‌లో బీచ్ వాలీబాల్ పోటీలు జరుగుతాయి.

కళాశాలలకు ఫిజికల్ డైరెక్టర్లు తప్పనిసరి

- యూనివర్సిటీ సమావేశాలకు గైర్హాజరయ్యే కాలేజీలపై చర్యలు
- నన్నయ వర్సిటీ వీసీ ప్రసన్నశ్రీ



సమావేశంలో మాట్లాడుతున్న వీసీ ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గోదావరి జిల్లాల్లోని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం అన్ని అనుబంధ కళాశాలల్లో ఫిజికల్ డైరెక్టర్‌లు తప్పనిసరిగా ఉండాలని ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ స్పష్టంచేశారు. అలాగే వర్సిటీ నిర్వహించే సమావేశాలకు గైర్హాజరైన కళాశాలలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విశ్వవిద్యాలయంలో మంగళవారం జరిగిన వర్సిటీ క్రీడాబోర్డ్ సాధారణ సమావేశంలో ఆమె మాట్లాడుతూ పీడీలు లేని కళాశాలలపై చర్యలు తీసుకుంటామన్నారు. వర్సిటీ పరిధిలో సుమారు 400 అనుబంధ కళాశాలలు ఉండగా వాటిలో ఎక్కువ కళాశాలలకు పీడీలు లేకపోవడం దురదృష్టకరమన్నారు. నేటి ప్రపంచంలో శారీరక వ్యాయామం లేక ఎక్కువ మంది విద్యార్థులు స్థూలకాయంతో అనారోగ్యాల బారిన పడుతున్నారన్నారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రభావం చూపే ఆటలకు ప్రాధాన్యమివ్వాలని స్పష్టం చేశారు. తాము విశ్వవిద్యాలయం నుంచి ఆకస్మిక తనిఖీలు చేపట్టి పీడీలు లేని కళాశాలలపై చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే 2024-25 విద్యాసంవత్సరంలో కళాశాలల వారీ సాధించిన పతకాలు, క్రీడాకారుల వివరాలను ప్రస్తావించి అభినందించారు. ప్రస్తుతం 47 రకాల పురుషుల, స్త్రీల అంతర్ కళాశాలల టోర్నమెంట్‌లు, విశ్వవిద్యాలయం జట్టు ఎంపికలు, ఈవెంట్స్ నిర్వహించే పీడీలు వర్సిటీ ప్రతిష్టను దృష్టిలో ఉంచుకొని టోర్నమెంట్‌లు నిర్వహించాలన్నారు. ఆలిండియా, సౌత్‌జోన్ పోటీల్లో ఎక్కువ పతకాలు సాధించిన కళాశాలకు రూ.10 వేలు నగదు బహుమతితోబాటు పీడీకి గౌరవ పురస్కారాలు అందిస్తామన్నారు. అకడమిక్ కరిక్యూలమ్‌కు ఇబ్బంది లేకుండా త్వరలో క్రీడా క్యాలెండర్ సిద్ధం చేయాలన్నారు. క్రీడాబోర్డు కార్యదర్శి ఆచార్య కేవీ స్వామి 2025-26 సీజన్‌లో అంతర్ కళాశాలలు, అంతర్ విశ్వవిద్యాలయాల జట్లు ఎంపికల నిర్వహణపై పీడీలతో చర్చించారు. ఈ సందర్భంగా ఫిజికల్ డైరెక్టర్స్ అసోసియేషన్ తరఫున వీసీని సన్మానించారు. కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్‌కే, సీడీసీ డీన్ ఎ.మట్టారెడ్డి, విశ్వవిద్యాలయ వ్యాయామ విద్య అధ్యాపకులు, పీడీలు, అనుబంధ కళాశాలల పీడీలు పాల్గొన్నారు.

అరుణాచలం, రామేశ్వరం

పుణ్యక్షేత్రాల యాత్ర

30 మంది భక్తులతో బయలుదేరి వెళ్లిన ఆర్టీసీ బస్సు

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అరుణాచలం, రామేశ్వరం యాత్రకు మంగళవారం సాయంత్రం రాజమహేంద్రవరం ఆర్టీసీ డిపో నుంచి 30 మంది భక్తులతో స్టార్‌లైనర్ నాన్ ఏసీ స్లీపర్ బస్సు బయలుదేరి వెళ్లిందని డిపో మేనేజర్ కె.మాధవ్ తెలిపారు. ఈ యాత్రలో 9 రోజులపాటు కాణిపాకం, శ్రీపురం, అరుణాచలం, పళని, కోయంబత్తూర్, కుంభకోణం, చిదంబరం, గురువాయూర్, త్రివేంద్రం, కన్యాకుమారి, మధురై, రామేశ్వరం, శ్రీరంగం, తంజావూరు, తదితర 14 పుణ్యక్షేత్రాలను దర్శించుకుని తిరిగి 18వ తేదీన రాజమహేంద్రవరం డిపోకు చేరుకుంటుందని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ ట్రాఫిక్ ఎం.అజయ్‌బాబు, అసిస్టెంట్ ఇంజనీర్ ఎస్.నాగలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో మెరుగైన వైద్యసేవలందించాలి

- వైద్యారోగ్య శాఖ ఆర్‌డీ పద్మాశశిధర్
- నర్సులుగా నియామకం పొందిన వారికి జాయినింగ్ ఉత్తర్వులు



స్టాఫ్‌నర్సుగా నియామకపత్రాన్ని అందజేస్తున్న పద్మాశశిధర్

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో స్టాఫ్‌నర్సులుగా నియామకం పొందిన వారు గ్రామాల్లోని పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ప్రాంతీయ వైద్య, ఆరోగ్య సంచాలకులు జోన్-2 డాక్టర్ పి.పద్మాశశిధర్ అన్నారు. మంగళవారం రాజమహేంద్రవరంలోని ఆర్‌డీ కార్యాలయంలో కాంట్రాక్టు ప్రాతిపదికన స్టాఫ్ నర్సు పోస్టుల భర్తీకి సంబంధించి తుది మెరిట్ జాబితాలో నిలిచిన అభ్యర్థులకు సర్టిఫికెట్ల పరిశీలన చేశారు. డిప్యూటీ డైరెక్టర్ ఎల్.శ్రీనివాసరావు పర్యవేక్షణలో ఆఫీసు సూపరింటెండెంట్లు పి.శ్రీనివాసులు, ఎండీ ఉస్మాన్, కె.రామచంద్రరావు, సీనియర్ అసిస్టెంట్లు ఏఎస్ మూర్తి, ఎంఏ జాఫర్ ఈ ప్రక్రియ నిర్వహించారు. అనంతరం ఖాళీలకు కౌన్సెలింగ్ నిర్వహించి మొత్తం 53 మందికి పద్మా శశిధర్ చేతులమీదుగా ఉద్యోగ నియామకపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆర్‌డీ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వం అందిస్తున్న ఆరోగ్య సేవలు, పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కాఫీ తోటల్లో తెగుళ్లపై అధికారులు అప్రమత్తం



కాఫీ తోటలను పరిశీలిస్తున్న అధికారులు

మారేడుమిల్లి, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లాలో పలు చోట్ల కాఫీ తోటల్లో కాయతొలుచు పురుగు వల్ల తెగుళ్ల ఏర్పడడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశాలతో ఎంపీడీవో శ్రీనివాస్ విశ్వనాథ్ ఆధ్వర్యంలో ఉద్యానవన, వ్యవసాయశాఖల అధికారులు బృందంగా ఏర్పడి మారేడుమిల్లి, చట్లవాడ పంచాయతీలో పర్యటించారు. కాఫీ తోటల్లో కాయ తొలుచు పురుగు క్షుణ్ణంగా పరిశీలించారు. మండల పరిధిలో 78 హెక్టార్లలో 11 బ్లాకులుగా ఈ కాఫీ తోటలు విస్తరించి ఉన్న ప్లాంటేషన్‌ను క్షుణ్ణంగా పరిశీలించి కాయ తొలుచు పురుగు ఆనవాళ్లు లేవని నిర్ధారించారు. దీనిపై పూర్తిస్థాయి నివేదికను కలెక్టర్ కార్యాలయానికి అందించనున్నామని అధికారులు తెలిపారు. ఈ పరిశీలనలో ఉద్యానవన శాఖ మండలాధికారి కె.ముత్తయ్య, వ్యవసాయ శాఖ అధికారి వెంకటేశ్వర్లు, అగ్రికల్చర్ సహాయకులు రవి, తదితరులు పాల్గొన్నారు.

రావులపాలెం ఛాంబర్ అధ్యక్షుడిగా కనికిరెడ్డి



ఛాంబర్ అధ్యక్షుడిగా ఎన్నికైన కనికిరెడ్డిని సత్కరిస్తున్న దృశ్యం

రావులపాలెం, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): రాజపురస్కార అవార్డు గ్రహిత పోతంశెట్టి కనికిరెడ్డి రావులపాలెం ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రావులపాలెంలోని ఛాంబర్ కామర్స్ భవనంలో పూర్వ అధ్యక్షుడు కర్రి నాగిరెడ్డి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.గౌరవ అధ్యక్షుడిగా ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, అధ్యక్షుడిగా పోతంశెట్టి కనికిరెడ్డి, సెక్రటరీగా ఎం.సూరిబాబు, ట్రెజరర్‌గా మండవల్లి మహేష్, వైస్ ప్రెసిడెంట్స్‌గా కర్రి శ్రీనివాస రెడ్డి, మామిడిశెట్టి సోమరాజు, ఆకుల శివ, జాయింట్ సెక్రటరీలుగా కొవ్వూరి వంశీకృష్ణారెడ్డి, నీలకంఠం, మన్యం ప్రసాద్, జాయింట్ ట్రెజరర్‌గా కడించర్ల నాగరాజులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా కనికిరెడ్డి మాట్లాడుతూ వ్యాపారులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూస్తామన్నారు. నిలిచిపోయిన ఛాంబర్ భవనాన్ని అధునాతనంగా తీర్చిదిద్దేందుకు కృషిచేస్తానన్నారు. వ్యాపారుల వల్ల వినియోగదారులకు, వినియోగదారుల వల్ల వ్యాపారులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా సమావేశాల్లో చర్చించి కార్యచరణ రూపొందించి దానికి అనుగుణంగా వ్యవహరిస్తామని పేర్కొన్నారు.

టీటీడీ అన్నప్రసాదం ట్రస్టుకు రూ.10 లక్షల విరాళం



టీటీడీ చైర్మన్‌కు చెక్కు అందజేస్తున్న దాత చిరంజీవి

తిరుమల, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): టీటీడీ అన్నప్రసాదం ట్రస్టుకు రూ.10 లక్షలు విరాళంగా అందింది. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరానికి చెందిన చిరంజీవి విరాళం చెక్‌ను తిరుమలలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడికి మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యుడు జ్యోతుల నెహ్రూ పాల్గొన్నారు.

నిత్యాన్నదాన పథకానికి రూ.2 లక్షల విరాళం



ఏఈవోకు విరాళం అందజేస్తున్న దాత

అన్నవరం, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానంలో ప్రతి ష్టాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవ నిత్యాన్నదాన పథకానికి మంగళవారం విశాఖపట్నానికి చెందిన చింతల అప్పలనాయుడు రూ.2 లక్షలు విరాళంగా సమర్పించారు. ఆలయ విభాగ ఏఈవో భాస్కర్‌కు అందజేయగా దాతను ఆయన అభినందించి వారికి స్వామివారి ప్రసాదం,ప్రత్యేక దర్శన సౌకర్యం కల్పించారు.

కాకినాడ-రాజమహేంద్రవరం ప్రత్యేక రైలు

15 నుంచి ప్రారంభం



సామర్లకోట, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): కాకినాడపోర్టు-రాజమహేంద్రవరం మధ్య ప్రత్యేక రైలును ఈ నెల 15 నుంచి ప్రారంభించనున్నట్టు రైల్వే సీపీఆర్వో ఎ.శ్రీధర్ మంగళవారం రాత్రి ప్రత్యేక ఆదేశాల జారీ చేశారు. ఈ మేరకు సామర్లకోట రైల్వే ఉన్నతాధికారులకు అందిన సమాచారం ఇలా ఉంది. ఈ రెండు పట్టణాల మధ్య ప్రయాణికుల అవసరాలు తీర్చేందుకు స్వల్ప టిక్కెట్ ధరలతో బాటు సమయం ఆదా అయ్యే విధంగా ఈ ప్రత్యేక రైలు ప్రయాణాన్ని సద్వినియోగం చేసుకోవాలని సీపీఆర్వో శ్రీధర్ ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

07523 నెంబరు గల కాకినాడ పోర్టు నుంచి రాజమహేంద్రవరం మధ్య ప్రయాణించే ప్రత్యేక రైలు ఈనెల 15 నుంచి ఉదయం 6.15గంటలకు బయలుదేరుతుంది. కాకినాడ టౌన్‌కు 6.23గంటలకు, సామర్లకోటకు 6.38 గంటలకు, జి.మేడపాడుకు 6.43గంటలకు, బిక్కవోలుకు 6.48గంటలకు, అనపర్తికి 6.53గంటలకు, ద్వారపూడికి 6.58గంటలకు, రాజమహేంద్ర వరానికి 8.15 గంటలకు చేరుతుంది.

07524 నెంబరు గల రాజమహేంద్రవరం నుంచి కాకినాడ పోర్టు మధ్య ప్రయాణించే ప్రత్యేక రైలు ఈ నెల 16 నుంచి 3.00గంటలకు బయలుదేరుతుంది. ద్వారపూడికు 3.13గంటలకు, అనపర్తికు 3.18గంటలకు, బిక్కవోలుకు 3.23గంటలకు, జీ.మేడపాడుకు 3.28గంటలకు, సామర్లకోటకు 3.43గంటలకు, కాకినాడ టౌన్‌కు 4.08గంటలకు, కాకినాడ పోర్టుకు 4.40గంటలకు చేరుతుంది. ఈ ప్రత్యేక రైళ్ల రాకపోకలు తిరిగి ప్రకటించే ఇవే సమయాలు అమలులో ఉంటాయని, ఈ రైళ్ల ప్రయాణ సమయం రెండు గంటలు మాత్రమే అయినందున గ్రామీణ ప్రాంతాల ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని సీపీఆర్వో శ్రీధర్ పేర్కొన్నారు.

వైసీపీ కులాల మధ్య అల్లర్లు సృష్టించాలని చూస్తోంది

కార్మికశాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్

అమరావతి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కులాల మధ్య అల్లర్లు సృష్టించాలని వైసీపీ చూస్తోందని రాష్ట్ర కార్మికశాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్ మండిపడ్డారు. వైసీపీ గాలిమాటలు నమ్మి ప్రజలు మోసపోవద్దని కోరారు. మంగళవారం అమరావతి సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. వైసీపీ ప్రతిపక్షం కాదని విషవృక్షమని మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా పని చేసిన చిర్ల జగ్గిరెడ్డిలో అవగాహన లోపం ఉందనేది ఆయన మాటలతీరుతో అర్థమవుతోందన్నారు. శెట్టిబలిజల గురించి మాట్లాడే హక్కు వైసీపీకి లేదన్నారు. బీసీల రక్షణకు ప్రత్యేక చట్టం తీసుకురావాలన్న కృత నిశ్చయంతో ప్రభుత్వం ఉందన్నారు. స్థానిక సంస్థల్లో బీసీల రిజర్వేషన్లను 24 శాతానికి తగ్గించిన వైసీపీ ఇప్పుడు బీసీల పట్ల మొసలి కన్నీరు కారుస్తోందన్నారు. బీసీలకు అగ్రతాంబూలం ఇచ్చిన పార్టీ టీడీపీ అని బార్లు, వైన్ షాపుల్లో శెట్టిబలిజలకు అవకాశం కల్పించిందన్నారు. సూపర్ సిక్స్ సూపర్ హిట్ కావడంతో దిమ్మతిరిగి వైసీపీ నేతలు అవాకులు చవాకులు మాట్లాడుతున్నారని మంత్రి సుభాష్ మండిపడ్డారు.

రాష్ట్రంలో యూరియా కొరత ఉందనడం పూర్తిగా అవాస్తవమని మంత్రి అన్నారు. కేవలం రైతులను భయాందోళనకు గురి చేసి రాజకీయ లబ్ధి పొందాలనే దురుద్దేశంతోనే వైసీపీ విషప్రచారం చేస్తోందన్నారు. జగన్ రెడ్డి తన ఐదేళ్ల పాలనలో ఏటా సగటున 5 లక్షల టన్నుల యూరియా మాత్రమే రైతులకు అందించారని, కానీ కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ ఖరీఫ్ సీజన్‌లో 7 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను అందుబాటులోకి తెచ్చిందని, మరో 40 వేల మెట్రిక్ టన్నులు ఈ నెల 10వ తేదీలోగా రైతులకు చేరనుందని చెప్పారు.

అయినవిల్లి ఆదాయం రూ.66.68 లక్షలు

శ్రీసిద్ధివినాయక ఆలయంలో కానుకల లెక్కింపు


హుండీల్లో కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

అయినవిల్లి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లి శ్రీసిద్ధివినాయక ఆలయంలోని హుండీల్లో కానుకలను మంగళవారం లెక్కించారు. వినాయక చవితి మహోత్సవాలు ఆగస్టు 27 నుంచి ఈనెల 4 వరకు నిర్వహించారు. రాష్ట్రం నలుమూలల నుంచి తరలివచ్చిన సుమారు లక్షా 50వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఉత్సవాల సందర్భంగా వివిధ టిక్కెట్ల అమ్మకాల ద్వారా రూ.43,58,204 ఆదాయం వచ్చింది. ప్రత్యేక అభిషేకాలు 2737, టిక్కెట్ల ద్వారా రూ.6.84లక్షలు, హుండీల ఆదాయం రూ.15,75,149, ఉత్సవ పందిరి హుండీ రూ.28, 133, అన్నదానం హుండీ రూ.22, 521 ఆదాయం రాగా మొత్తం ఉత్సవాల ఆదాయం రూ.66, 68,225 వచ్చినట్టు ఆలయ సహాయ కమిషనర్ అల్లు దుర్గాభవానీ తెలిపారు. గతేడాది ఉత్సవాల ఆదాయం రూ.51, 51,788 వచ్చిందని చెప్పారు.

తాగిన మైకంలో తాచుపాముతో చెలగాటం

- కాటేసినా పట్టించుకోకుండా మెడలో వేసుకుని హల్‌చల్
- భయభ్రాంతులకు గురైన స్థానికులు

ముమ్మిడివరం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తాగిన మైకంలో ఓ వ్యక్తి తాచుపాముతో చెలగాటమాడి ప్రాణాలపైకి తెచ్చుకున్నాడు. ఈ సంఘటన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం కమిని పంచాయతీ పరిధిలోని పొట్టితిప్పలో మంగళవారం జరిగింది. పొట్టితిప్పకు చెందిన గొల్లపల్లి వెంకటేశ్వరరావు అలియాస్ కొండ మంగళవారం తాగిన మైకంలో కోడిగుడ్ల కోసం కోళ్లకు ఉంచిన గంప దగ్గరికి వెళ్లి చేయి పెట్టగా గంప కింద ఉన్న తాచుపాము కాటేసింది. అప్పటికే పూర్తిగా మద్యం మత్తులో ఉన్న వెంకటేశ్వరరావు ఆ పామును పట్టుకుని నన్నే కరుస్తావా అంటూ మెడలో వేసుకుని హల్‌చల్ చేశాడు. దీంతో స్థానికులు భయ భ్రాంతులకు గురై పామును వదిలేయమని వెంకటేశ్వరరావును హెచ్చరించినా లెక్క చేయకుండా పామును మీ పైకి వదులుతానని దానితో చెలగాటమాడిన క్రమంలో మరోసారి ఆ పాము వెంకటేశ్వరరావును కాటేసింది. స్థానికులు మూకుమ్మడిగా వెంకటేశ్వరరావు నుంచి పాము వేరు చేసి దాన్ని హతమార్చి చికిత్స కోసం వెంకటేశ్వరరావును ఐ.పోలవరం మండలం టి.కొత్తపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అత్యవసర వైద్యసేవల నిమిత్తం వెంకటేశ్వరరావును అక్కడి నుంచి కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.


పామును మెడలో వేసుకున్న వెంకటేశ్వరరావు


స్థానికుల చేతిలో హతమైన తాచుపాము


అంబులెన్సులో వెంకటేశ్వరరావు

వాటర్ ప్లాంట్‌లో క్లోరిన్ గ్యాస్ లీక్

- యానాంలో సంఘటన
- 200 మీటర్ల వరకు వ్యాప్తి
- 15 మందికి అస్వస్థత
- ఆసుపత్రికి తరలింపు




క్లోరిన్ గ్యాస్ లీకైన ట్యాంక్, వాటర్ స్ప్రే చేస్తున్న దృశ్యం

యానాం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): యానాం శివారు కనకాలపేటలో ప్రజాపనుల శాఖ ద్వారా పరిసరర ప్రాంత ప్రజలకు తాగునీటిని శుద్ధి చేసి సరఫరా చేసే వాటర్ ప్లాంట్‌లో మంగళవారం సాయంత్రం ఒక్కసారిగా క్లోరిన్ గ్యాస్ ట్యాంక్ లీకైంది. దీంతో అధికారులు, సిబ్బంది భయభ్రాంతులకు గురయ్యారు. అక్కడే ఉన్న అధికారులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. విషయం తెలుసుకున్న ఫైర్ సిబ్బంది సంఘటనప్రాంతానికి చేరుకుని క్లోరిన్ లీకైన ప్రాంతంలో వాటర్ స్ప్రే చేయడంతో వారిలో కొంతమంది తీవ్ర అస్వస్థతకు గురై పడిపోయారు. 200 మీటర్ల వరకు క్లోరిన్ వ్యాప్తి చెందడంతో అందరూ మాస్క్‌లు ధరించారు. అక్కడే ఉన్న ప్రజాపనులశాఖ ఈఈ నాగరాజు, జేఈలు సంతోష్, బోడ్డు ప్రసాద్‌తో పాటు ఫైర్‌సిబ్బంది అస్వస్థతకు గురికావడంతో ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఆర్‌ఏ అంకిత్‌కుమార్, ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ సంఘటనా ప్రాంతాన్ని పరిశీలించి అక్కడ పరిస్థితిపై సమీక్షించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించారు. తక్షణం కనకాలపేటలో వైద్యసిబ్బంది, అంబులెన్సు సర్వీస్‌లను ఏర్పాట్లు చేశారు. ముఖ్యంగా సమీప ప్రాంతంలో ఉన్నవారు వికారం, వాంతులు, తల తిరగడం, ఊరిరి పీల్చుకునేందుకు ఇబ్బందులు పడ్డారు. ఇది కేవలం సిబ్బంది నిర్లక్ష్యంతోనే జరిగినట్టు తెలిసింది. క్లోరిన్ గ్యాస్ అయిపోయిందా లేదా అనేది పరిశీలించేందుకు తెరవడంతో దాంట్లో ఉన్న క్లోరిన్ ఒక్కసారిగా వ్యాప్తి చెందడంతోనే ఈ సంఘటన జరిగినట్టు తెలిసింది. ప్రస్తుతం అధికారులు, సిబ్బంది, స్థానికులు 15మంది వరకు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రజలెవ్వరూ ఆందోళన చెందవద్దని ఎమ్మెల్యే, ఆర్‌ఏ తెలిపారు. పుదుచ్చేరిలో ఉన్న డిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు గ్యాస్ లీకేజీ సంఘటనకు సంబంధించి పుదుచ్చేరి ప్రజాపనులశాఖ ఎస్ఈ వీరసేల్వతో చర్చించారు. యానాం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని వీడియోకాల్‌లో పరామర్శించారు. అలాగే బాధితులను ఎన్ఆర్ కాంగ్రెస్ యానాం శాఖ అధ్యక్షుడు మల్లాడి సామ్యూల్, వ్యాపార వేత్త తోట రాజు పరామర్శించారు.


గ్యాస్ లీక్ కారణంగా సమీపంలో మాడిపోయిన చెట్లు

ఏలేరు జలాశయంలో పెరుగుతున్న నీటి నిల్వలు

ఏలేశ్వరం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ఏలేరు జలాశయంలో నీటి నిల్వలు పెరుగుతున్నాయి. మెస్తారు వర్షాలు కురవడంతో వరదనీరు, గోదావరి జలాలు విడుదల చేస్తుండడంతో రిజర్వాయర్‌లోని నీరు పెరుగుతోంది. దీంతో ప్రాజెక్టులో నీటి నిల్వలు రోజు రోజుకు పెరుగుతున్నాయి. పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం నుంచి గోదావరి జలాలు 1225 క్యూసెక్కులు ఏలేరు జలాశయానికి విడుదలవుతున్నాయి. గతంలో ఎన్నడూ లేని రీతిలో ప్రాజెక్టులో 86.56 మీటర్ల స్థాయిలో 24.11 టీఎంసీల నీటిని నిల్వ చేసే అవకాశం ఉంది. 81.59 మీటర్ల స్థాయిలో 15.33 టీఎంసీలు నిల్వలు ఉన్నాయని అధికారులు తెలిపారు. ఎడమ కాలువ నుంచి విశాఖపట్నంకి 175 క్యూసెక్కులు విడుదల చేస్తున్నట్టు తెలిపారు.


ఏలేరు జలాశయంలో నీటి నిల్వలు

బస్సు ఢీకొని యువకుడి మృతి


సూరిబాబు మృతదేహం వద్ద స్థానికులు

గండేపల్లి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గండేపల్లి మండలం మల్లేపల్లికి యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మల్లేపల్లికి చెందిన మదపాటి సూరిబాబు (35)రోజువారి పని నిమిత్తం వెళ్లి తాళ్లూరు-బొర్రంపాలెం మధ్య పక్కన నిలబడి ఉండగా నేషనల్ హైవేపై ప్రైవేటు ట్రావెల్ బస్సు ఢీకొనడంతో అక్కడక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెద్దాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించినట్టు ఎస్సై శివనాగబాబు చెప్పారు.

ద్విచక్రవాహనం ఢీకొని..


మృతిచెందిన రాము

చింతూరు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఛత్తీస్‌గడ్‌కు చెందిన సవలం రాము (35) మృతిచెందాడు. చింతూరు మండలం గొర్రెలగూడెం సమీపంలో 30 నెంబరు జాతీయ రహదారిపై మంగళవారం రాము భద్రాచలం వైపు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనం ఢీకొంది. దీంతో రాము అక్కడికక్కడే మృతిచెందాడు. ఎదురుగా ద్విచక్రవాహనంపై వస్తున్న వ్యక్తుల్లో ఒకరిది చింతూరు మండలం బలిమెల కాగా మరొకరిది మారేడుమిల్లి మండలం పెద్దమల్లంపాడుగా చింతూరు పోలీసులు గుర్తించారు.

మోటారుసైకిల్ ఢీకొని...


వెంకాయమ్మ (ఫైల్)

పెరవలి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పశ్చిమ గోదావరి జిల్లా తణుకు జాతీయ రహదారిపై కడింపాడు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కోనసీమ జిల్లా రావులపాలెం మండలం రావులపాడుకు చెందిన కొప్పిశెట్టి వెంకాయమ్మ (68) మంగళవారం ఉదయం తన బంధువుల ఇంటికి వెళ్లేటప్పుడు పెరవలి మండలం కడింపాడు సెంటర్ వద్ద ఆటోలో వచ్చి దిగింది. రోడ్డు దాటుతుండగా మోటారుసైకిల్ ఆమెను బలంగా ఢీకొంది. తీవ్ర గాయం కాగా తణుకు ఆసుపత్రిలో చేర్చారు. మెరుగైన వైద్యం కోసం వేరే ఆసుపత్రికి తరలించగా ఆమె మరణించింది. ఆమె కుమారుడు కొప్పిశెట్టి వీరభద్రం ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ వెంకటేశ్వరరావు పేర్కొన్నారు.

లారీ ఢీకొని ముగ్గురికి తీవ్రగాయాలు

గొల్లప్రోలు రూరల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. గొల్లప్రోలు శివాలయ మాన్యం కాలనీకి చెందిన సేటిపల్లి సాయి కుమార్ బంధువులైన ఇద్దరు పిల్లలు కుంపట్ల శర్మిల క్రాంతి, నరసింహమూర్తితో కలిసి మోటార్‌సైకిల్‌పై గొల్లప్రోలు నుంచి తాటిపర్తి వెళ్లాడు. తాటిపర్తిలో ముందుగా వెళ్తున్న లారీ నిర్లక్ష్యంగా అతివేగంతో తిప్పడంతో మోటార్‌సైకిల్‌ను ఢీకొంది. ముగ్గురికి గాయాలు కాగా పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఎస్ఐ రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టిప్పరు ఢీకొని ఇద్దరికి గాయాలు

శంఖవరం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా శంఖవరం నంచి కొంతంగి కొత్తూరు వెళ్తున్న ఆటోను రౌతులపూడి వైపు వెళ్తున్న టిప్పరు ఢీకొనడంతో ఇద్దరు గాయపడ్డారు. కొంతంగి కొత్తూరుకి చెందిన కర్రి రాజబాబు, కర్రి గోవిందు శంఖవరంలో పని ముగించుకుని తిరిగి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. స్థానికులు క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు.


సంఘటనా స్థలంలో క్షతగాత్రులు

కానిస్టేబుల్, హోంగార్డులపై దాడి.. ముగ్గురి యువకుల అరెస్ట్


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ భవ్యకిషోర్

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో కానిస్టేబుల్, హోంగార్డులపై దాడికి పాల్పడిన ముగ్గురు యువకులను అరెస్ట్ చేసినట్టు సౌత్‌జోన్ డీఎస్పీ ఎస్.భవ్యకిషోర్ మంగళవారం తెలిపారు. వివరాల ప్రకారం.. ఆదివారం అర్ధరాత్రి కోటిపల్లి బస్టాండ్ వెనుక సోనోవిజన్ షోరూం దగ్గర రాజానగరం పోలీస్‌స్టేషన్ పరిధిలోని పాతతుంగపాడుకు చెందిన పాత రౌడీషీటర్ కట్టుంగ హరీష్, రాజమహేంద్రవరం రూరల్ మండలం రాజవోలు అభ్యుదయ కాలనీకి చెందిన కర్రి దుర్గసూర్యప్రసన్నకుమార్, సంజీవయ్య కాలనీకి చెందిన ములపర్తి వినోద్ మద్యం మత్తులో గొడవపడుతున్నారు. ఆ సమయంలో నైట్ బీట్‌లో ఉన్న కానిస్టేబుల్ యు.నాగబాబు, హోంగార్డు కాళీ వారిని అదుపుచేయడానికి ప్రయత్నించగా వారిపైనే దాడి చేసి గాయపరిచారు. ఈ ఘటనకు సంబంధించి టుటౌన్ సీఐ టీఎస్‌వీఎస్ శ్యాం సుందర్ సిబ్బందితో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ముగ్గురిని సోమవారం రాత్రి ఈస్ట్ రైల్వేస్టేషన్ రోడ్డులో అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచినట్టు డీఎస్పీ తెలిపారు. సమావేశంలో సీఐ టీఎస్‌వీఎస్ శ్యాంసుందర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

దారి దోపిడీ కేసులో ముగ్గురి అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న సీఐ వెంకటనారాయణ

రామచంద్రపురం(ద్రాక్షారామ), సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కె.గంగవరం మండలం అద్దంపల్లిలో జరిగిన దారి దోపిడీ కేసులో ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. రామచంద్రపురం సీఐ కార్యాలయంలో మంగళవారం విలేకర్ల సమావేశంలో వివరాలను సీఐ ఎం.వెంకట నారాయణ వెల్లడించారు. ఈనెల 3న రాత్రి అద్దంపల్లికి చెందిన యండమూరి శ్రీనివాస్ ద్రాక్షారామలో తాను పనిచేస్తున్న నగల దుకాణం మూసివేసి ఇంటికి వెళ్తుండగా అద్దంపల్లి దేవాంగుల శ్మశానవాటిక వద్దకు వచ్చేసరికి ఇద్దరు ఆటోలో వచ్చి ఇనుపపైపుతో కొట్టి కళ్లలో కారం చల్లి సుమారు 10 గ్రాముల బంగారు ఆభరణాలు, సెల్‌ఫోన్, రూ.5వేల నగదు, యాక్టివా మోటారు సైకిల్‌ను దోచుకున్నారు. దీనిపై కె.గంగరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మంగళవారం సాయంత్రం కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం లచ్చిపాలెం ఏరియా బైపాస్‌రోడ్డులో తాళ్లరేవు మండలం గాడిమొగకు చెందిన ఓలేటి సత్తిబాబు, సంగాడిరాజు, మల్లవరం శివారు పత్తిగొందికి చెందిన కళ్లేపల్లి ప్రసాద్‌ను సీఐ వెంకటనారాయణ, సిబ్బంది అరెస్టు చేశారు. వారి నుంచి బంగారు ఆభరణాలు, యాక్టివా మోటారు సైకిల్, దోపిడీకి వినియోగించిన ఆటో, 3 సెల్‌ఫోన్లు, రూ.1000 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఓలేటి సత్తిబాబు చేపల వ్యాపారంచేస్తూ బెట్టింగ్‌లకు బానిసై అప్పుల పాలయ్యాడు. ఎలాగైనా డబ్బు సంపాదించాలని మిగిలిన ఇద్దరితో కలసి దోపిడీకి పాల్పడినట్టు సీఐ పేర్కొన్నారు.

వివాహేతర సంబంధం నేపథ్యంలో వ్యక్తి ఆత్మహత్య

అలస్యంగా వెలుగులోకి ఘటన


సత్యభూషణం (ఫైల్)

కాకినాడ క్రైం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కాకినాడలో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. వివాహేతర సంబంధం నేపథ్యంలో సెల్ఫీ వీడియో రిలీజ్ చేసి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాల్లోకి వెళితే.. కాకినాడ జీజీహెచ్‌లో డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా పనిచేసే మామిడిశెట్టి సత్యభూషణం (45)కు భార్య, కుమారుడు ఉన్నారు. అతడు సెల్ఫీ వీడియోలో జరిగిన విషయాన్ని వివరించాడు. అతడు జీజీహెచ్‌లో పనిచేస్తున్న ఓ మహిళతో సహజీవనం చేస్తున్నాడు. వారు ఇంద్రపాలెంలో ఉంటుండగా పక్కనే ఉంటున్న పంపన నాగవీరదుర్గాప్రసాద్ అలియాస్ బుజ్జి మహిళతో పరిచయం పెంచుకున్నాడు. వాళ్లిద్దరి పరిచయం వివాహేతర సంబంధానికి దారి తీసింది. ఈ విషయం సత్యభూషణంకు తెలిసింది. అయితే 2 నెలల క్రితం ఆ మహిళను వివాహం చేసుకున్న సత్యభూషణం కాకినాడ కుళాయిచెరువు సమీపంలో ఉన్న మమత అపార్ట్‌మెంట్‌లోకి మారాడు. అయితే బుజ్జి తనతోనే ఉండాలని ఆ మహిళను బెదిరిస్తూ ఒప్పించాడు. ఈనెల 5న బుజ్జి ఆమెతో ఉండడాన్ని చూసి బుజ్జి ఇంటి కెళ్లి సత్యభూషణం ఘర్షణకు దిగాడు. "అయితే రాజకీయ అండదండలతో చంపేస్తానని బెదిరించాడని, నా చావుకు బుజ్జి, ఆ మహిళే కారణం" అని సత్యభూషణం సెల్ఫీ వీడియోను మొదటి భార్య, కుమారుడికి పంపి ఈనెల 6న ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అయితే బుజ్జి పరారీలో ఉన్నట్టు పోలీసులు తెలిపారు. టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజలు భయపడొద్దు

- అల్లూరి జిల్లా కలెక్టర్
- లబ్బర్తి, లాగరాయి, కింద్ర గ్రామాల్లో పర్యటన


ప్రజలతో మాట్లడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

రాజవొమ్మంగి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రజలు భయపడొద్దని అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ అన్నారు. అల్లూరి జిల్లా రాజవొమ్మంగి మండలంలోని లబ్బర్తి, లాగరాయి, కింద్ర గ్రామాల్లో ప్రజలు 3 నెలలుగా అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్న విషయం తెలిసిందే. దీనిపై మంగళవారం జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ ఆ గ్రామాల్లో పర్యటించారు. ప్రజలతో మాట్లాడి సమస్యలు విన్నారు. 3 గ్రామాల్లో నిర్వహిస్తున్న మెడికల్ క్యాంపులను పరిశీలించారు. లాగరాయి ప్రభుత్వాసుపత్రిని తనిఖీ చేశారు. అనంతరం విలేకర్లతో కలెక్టర్ మాట్లాడుతూ వార్తా కథనాలు చూసి వచ్చానని, ఇప్పటికే ఇక్కడ ఏడీఎంహెచ్‌వో డేవిడ్ గ్రామాల్లో తనిఖీలు చేపట్టి 3 బృందాలను ఏర్పాటు చేశారని తెలిపారు. గ్రామాల్లో పారిశుధ్యం లోపించినట్టు గుర్తించి సిబ్బందిని హెచ్చరించామన్నారు. గతంలో 15మంది బ్లడ్ శాంపిల్స్ తీసుకుని పరీక్షలు చేయగా వారిలో ఇద్దరికి చికెన్ గున్యా పాజిటివ్ వచ్చిందని, ప్రస్తుతం ప్రజలకు వైరల్ ఫీవర్ మాత్రమే ఉన్నప్పటికీ లక్షణాలు మాత్రం చికెన్ గున్యావి ఉన్నాయని, అయితే పరీక్షల్లో మాత్రం నెగిటివ్ వస్తున్నాయన్నారు. అన్నిరకాల మందులు స్థానిక పీహెచ్‌సీలో అందుబాటులో ఉన్నాయని, ప్రజల ఆరోగ్యంపై అధికారుల నిరంతర పర్యవేక్షణ ఉంటుందన్నారు. ఈ గ్రామాల్లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. ప్రతీ ఇంటిలో దోమలు నివారించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కిర్రాబు ఆనకట్ట నిర్మించాలని, జీవో నెంబర్ 3ని పునరుద్ధరించాలని ఆదివాసీ నాయకులు కలెక్టర్‌ను కోరారు. సబ్ కలెక్టర్ శుభం నొక్వాల్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అంబేడ్కర్, డీఎంహెచ్‌వో విశ్వేశ్వరనాయుడు, ఏడీఎంహెచ్‌వో డేవిడ్, తహశీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీవో యాదగిరేశ్వరావు ఉన్నారు.

చింతూరు డీఎఫ్‌వోగా రవీంద్రనాథ్‌రెడ్డి

లక్కవరం సబ్ డీఎఫ్‌వోగా శివకుమార్ గంగల్

చింతూరు, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): చింతూరు డీఎఫ్‌వోగా రవీంద్రనాద్‌రెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు విడుదల చేసింది. 2016 ఐఎఫ్ఎస్ బ్యాచ్‌కి చెందిన రవీంద్రనాథ్‌రెడ్డి కాకినాడ నుంచి ఇక్కడకు బదిలీపై రానున్నారు. ఇప్పటివరకు చింతూరు డీఎఫ్‌వోగా విధులు నిర్వర్తించిన బబిత డెహ్రాడూన్‌లో శిక్షణ పొందుతున్న నేపథ్యంలో ఈ బదిలీ జరిగింది. అలాగే చింతూరు డివిజన్ పరిధిలోని లక్కవరం రేంజి సబ్ డీఎఫ్‌వోగా శివకుమార్ గంగల్‌ని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 2022 ఐఎఫ్ఎస్ బ్యాచ్‌కు చెందిన శివకుమార్‌గంగల్ ప్రస్తుతం వన్యప్రాణుల సంరక్షణ విభాగంలో శిక్షణ పొందుతున్నారు. మరికొద్ది రోజుల్లో అధికారులు బాధ్యతలు స్వీకరించనున్నారు.

750 కిలోల రేషన్ బియ్యం పట్టివేత

తొండంగి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తొండంగి మండలం కొమ్మనాపల్లి గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన 750 కిలోల బియ్యాన్ని ఎంఎస్‌వో రాజు దాడి జరిపి పట్టుకున్నారు. మంగళవారం ఆయన కొమ్మనాపల్లిలో రేషన్ షాపును సందర్శించి వస్తుండగా రేషన్ బియ్యం మోటార్ సైకిల్‌పై తెస్తున్న నక్కా తాతారావును గమనించారు. అతడిని వెంబడించడంతో ఒక ఇంట్లో కొనుగోలు చేస్తున్న బియ్యాన్ని నిల్వ చేస్తున్నట్లు గుర్తించారు. గదిలో ఉన్న మొత్తం బియ్యాన్ని స్వాధీనం చేసుకుని సమీపంలోని రేషన్ షాపులో అప్పగించారు. కేసు నమోదు చేశారు. ఆయన వెంట వీఆర్వో విజయ్ ఉన్నారు.


స్వాధీనం చేసుకున్న బియ్యంతో ఎంఎస్‌వో

ఐషర్ వ్యాన్ ఢీకొని వ్యక్తి మృతి



సంఘటనా స్థలంలో ఐషర్ వ్యాన్


గంగరాజు (ఫైల్)

ముమ్మిడివరం, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): మోటారు సైకిల్‌పై వెళ్తున్న వ్యక్తిని ఐషర్ వ్యాన్ ఢీకొని పక్క నుంచి ఈడ్చుకుపోవడంతో తీవ్రంగా గాయపడి మృతిచెందాడు. ఈ సంఘటన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాశివానితూము పళ్లవారిపాలెం రోడ్డులో రాజుపాలెం సమీపంలో మంగళవారం జరిగింది. ముమ్మిడివరం మండలం లంకాఫ్ ఠాణేలంక పంచాయతీ పరిధిలోని కూనాలంకకు చెందిన కొప్పిశెట్టి గంగరాజు (45) మోటారు సైకిల్‌పై ముమ్మిడివరం వెళ్తుండగా రాజుపాలెం సమీపంలో అతడి వెనుక కొబ్బరి డొక్కల లోడుతో వస్తున్న ఐషర్ వ్యాన్ గంగరాజును తప్పించబోయి పక్క నుంచి దూసుకుపోవడంతో గంగరాజు తీవ్రంగా గాయపడ్డాడు. వ్యాను కొంతదూరం గంగరాజును ఈడ్చుకుపోవడంతోశరీరం నుజ్జు నుజ్జు అయింది. తీవ్రంగా గాయపడిన అతడిని ఆసుపత్రికి తరలించేందుకు అంబులెన్సులో ఎక్కిస్తుండగా మృతి చెందాడు. గంగరాజు కూరగాయల సాగు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. భార్య రాజేశ్వరి, కుమార్తె ఉన్నారు. ముమ్మిడివరం ఏఎస్ఐ ఆర్.గోపాలకృష్ణమూర్తి కేసు నమోదు చేసి మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం కుటుంబానికిఅప్పగించారు.

విద్యుత్‌షాక్‌తో యువకుడి మృతి

- మరో ఇద్దరికి గాయాలు
- కపిలేశ్వరపురం మండలం పడమరఖండ్రికలో ప్రమాదం


మరణించిన శ్రీనివాస్

కపిలేశ్వరపురం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ షాక్‌కు గురై వ్యక్తి మృతి చెందిన ఘటన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వపురం మండలం పడమరఖండ్రిక గ్రామంలో మంగళవారం జరిగింది. అంగర పోలీసులు స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కపిలేశ్వరపురం మండలం టేకి గ్రామానికి చెందిన వాసంశెట్టి శ్రీనివాసు(30) పడమరఖండ్రికలో ఇంటి నిర్మాణ పనులు చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో స్లాబ్ సెంటరింగ్ పనుల కోసం ఇనుక ఊచలను బిల్డింగ్‌పైకి లాగుతుండగా సమీపంలో ఉన్న 11కేవీ విద్యుత్ వైర్లు తగలడంతో శ్రీనివాసు అక్కడికక్కడే మృతిచెందాడు. అక్కడే ఉన్న వి.శ్రీను, జి.శివకృష్ణకు స్వల్పగాయాలు కావడంతో వారిని కపిలేశ్వరపురం పీహెచ్‌సీకి తరలించారు. మెరుగైన చికిత్స కోసం రాజమహేంద్రవరం ఆసుపత్రికి తరలించినట్లు చెప్పారు. శ్రీనివాసు భార్య కుమారి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మండపేట ప్రభుత్వాసుపత్రికి తరలించినట్టు ఎస్ఐ హరీష్ కుమార్ తెలిపారు. కాగా శ్రీనివాసుకు 8,6 ఏళ్ల వయస్సు కలిగిన ఇద్దరు కుమారులు ఉన్నారు. అతడి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

బాలికపై అత్యాచారం

కేసు నమోదు

గోకవరం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): బాలికపై అత్యాచారం జరిగినట్టు అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ వీఎస్‌వీ పవన్‌కుమార్ మంగళవారం తెలిపారు. తూర్పు గోదావరి జిల్లా గోకవరం మండలంలో ఓ గ్రామానికి చెందిన 16 ఏళ్ల బాలికను గోకవరానికి చెందిన మాగపు గాంధీ ప్రేమిస్తున్నానని 3వారాలుగా నమ్మబలికాడు. ఈనెల 8న బాలికను తన తల్లిదండ్రులకు పరిచయం చేస్తానని ఓ ఇంటికి తీసుకెళ్లాడు. ఇంట్లో ఉంచి బిర్యాని తీసుకొచ్చేందుకు బయటకు వెళ్లగా గోకవరానికి చెందిన గునుపే కిరణ్ ఇంట్లోకి చొరబడి తనపై అత్యాచారానికి పాల్పడినట్టు బాలిక ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

యూరియా కొరత లేదు

ఆర్డీవో కృష్ణనాయక్


గోకవరం సొసైటీ వద్ద యూరియా నిల్వలను పరిశీలిస్తున్న ఆర్డీవో

గోకవరం, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎక్కడా యూరియా కొరత లేదని ఆర్డీవో కృష్ణనాయక్ తెలిపారు. గోకవరం సొసైటీ వద్ద ఉన్న యూరియా నిల్వలను మంగళవారం ఆయన పరిశీలించారు. అక్కడున్న రైతులతో నేరుగా మాట్లాడి యూరియా కొరత లేదని, రైతులెవ్వరూ అధైర్య పడవద్దన్నారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ప్రస్తుతం 220 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందన్నారు. గోకవరం మండలంలో ఎక్కడా యూరియా కొరత లేదన్నారు. యూరియా పంపిణీ ప్రక్రియలో ఎటువంటి జాప్యం రాకూడదని సంబంధిత అధికారులకు సూచించారు. కాగా ఆర్డీవో కృష్ణనాయక్ ముందుగా తహశీల్దారు కార్యాలయాన్ని సందర్శించారు. భూ సంబంధిత అంశాలు, రికార్డులు, ప్రజల ఫిర్యాదులు,రెవెన్యూ పరమైన సమస్యలపై సమీక్షించి అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో తహశీల్దారు రామకృష్ణ, సొసైటీ సీఈవో డి.సురేష్‌బాబు పాల్గొన్నారు.

గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి

దివాన్‌చెరువు, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): గర్భిణులు పోషకాహారం తీసుకోవడంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని డాక్టర్ బెనడిక్ట్ సూచించారు. ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ (పీఎంఎస్ఎంఏ) కార్యక్రమంలో భాగంగా పాలచర్ల పీహెచ్‌సీలో గర్భిణులకు మంగళవారం పలు వైద్య పరీక్షలు చేశారు. హిమోగ్లోబిన్ మెరుగుపర్చుకోవడానికి మందులు, సరైన టీకాలుకు సంబంధించి కౌన్సెలింగ్ నిర్వహించారు. 32 మందికి బీపీ, షుగర్, హిమోగ్లోబిన్, హెపటైటిస్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించామని బెనడిక్ట్ తెలిపారు. కార్యక్రమంలో వైద్యఆరోగ్య సిబ్బంది, ఆశాలు పాల్గొన్నారు.

మందుల కిట్లు పంపిణీ

రాజమహేంద్రవరం కల్చరల్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): స్థానిక రామకృష్ణ మిషన్ ఆధ్వర్యంలో ఇన్ఫోసిస్ ఫౌండేషన్ ఆర్థిక సహకారంతో మంగళవారం 220 మంది గర్భిణులకు, బాలింతలకు రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞాయానందజీ మహరాజ్, ధర్మ వైద్యశాల ఇన్‌చార్జ్ స్వామి లోకామయానంద మహరాజ్ మందుల కిట్లను పంపిణీ చేశారు. మాతా శిశు సంరక్షణ పథకంలో భాగంగా జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ మణికంఠ, వేణుమాధవి, రామకృష్ణ మిషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వాసును కలిసిన బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్


నరసింహమూర్తిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే వాసు

రాజమహేంద్రవరం కల్చరల్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన తేజోమూర్తుల నరసింహమూర్తి ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. తనకు డైరెక్టర్‌గా అవకాశం రావడానికి సహకరించినందుకు ప్రత్యేక కృతజ్ఞతలను తెలిపారు. బ్రాహ్మణ కార్పొరేషన్‌ను మరింత బలోపేతం చేయడానికి ప్రభుత్వం తగిన నిధులు కేటాయించేందుకు సహకరించాలని ఎమ్మెల్యే వాసును కోరారు. ఈ సందర్భంగా తేజోమూర్తులను ఎమ్మెల్యే సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు శెట్టి జగదీష్, శ్రీ ఉమా మార్కండేశ్వర పురోహిత సంఘ సభ్యులు, నగర బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇద్దరు జీఎస్ఎల్ విద్యార్థులకు గోల్డ్ మెడల్స్


గోల్డ్‌మెడల్స్ అందుకుంటున్న అనస్థీషియా విద్యార్థులు

రాజానగరం, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): జీఎస్ఎల్ మెడికల్ కళాశాలలో ఎండీ ఎనస్థీషియా అభ్యసించిన ఇద్దరు విద్యార్థులకు గోల్డ్ మెడల్స్ లభించాయి.ఈ మేరకు విజయవాడలోని ఎన్టీఆర్ యూనివర్శిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్‌లో మంగళవారం జరిగిన స్నాతకోత్సవంలో ఛాన్సలర్, గవర్నర్ అబ్దుల్ నజీర్ బంగారు పతకాలను ప్రదానం చేశారు. 2021 సంవత్సరానికి డాక్టర్ రోహిత, 2022 సంవత్సరానికి డాక్టర్ సీహెచ్ ప్రియాంక బెస్ట్ అనస్థీషియా స్టూడెంట్లుగా గోల్డ్‌మెడల్స్ అందుకున్నారు. ఈ సందర్భంగా జీఎస్ఎల్ మెడికల్ కళాశాల అనస్థీషియా హెచ్‌వోడీ డాక్టర్ జి.విజయలక్ష్మి విద్యార్థులను అభినందించారు.

ముస్లిం కార్పొరేషన్ డైరెక్టర్‌గా బాషాలిమ్రా



రాజమహేంద్రవరం కల్చరల్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): జనసేన నగర ప్రధాన కార్యదర్శి షేక్ బాషా లిమ్రా నూర్ బాషా కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. జనసేన పార్టీ ఆవిర్భావం నాటి తొలి 150 మంది క్రియాశీలక కార్యకర్తల్లో ఒకరిగా పార్టీకి నిరంతర సేవలందిస్తున్న బాషా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నూర్ బాషా యువజన విభాగానికి అధ్యక్షుడిగా పనిచేశారు. తనకు ఈ పదవిని కల్పించిన సీఎం చంద్రబాబుకు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రభుత్వ సహకారంతో చైర్మన్ అధ్యక్షతన కార్పొరేషన్‌కు మరింత సేవలందిస్తానని బాషా అన్నారు. కాగా ఆయనకు రాష్ట్ర స్థాయి పదవి లభించడం పట్ల జనసేన శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి.

ఉపాధి హామీ పనుల్లో రూ.2.43 లక్షలు రికవరీ

రాజానగరం సామాజిక తనిఖీల్లో వెలుగు చూసిన అక్రమాలు

రాజానగరం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : 2024-25 ఆర్థిక సంవత్సరానికి మండలంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో 1375పనులకు గానూ రూ.12,03,21,228 కోట్లు ఖర్చు చేసినట్టు ఎంపీడీవో ఝాన్సీ తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ సీసీ రహదారులు 96 పనులకు రూ.5,93,79,841 కోట్లు, పది డ్రైనేజీ పనులకు రూ.4,52,344 లక్షలు ఖర్చు చేశామన్నారు. మండల స్థాయి సామాజిక తనిఖీ సదస్సులో రూ.2,43,223 రికవరీకి గానూ రూ.28 వేలు జరిమానాలు విధించినటుట చెప్పారు. సమావేశంలో ఎంపీపీ మండారపు సీతారత్నం, ప్రిసైడింగ్ అధికారి బి.రాంప్రసాద్, జిల్లా విజిలెన్స్ అధికారి కె.రత్నకుమారి, సామాజిక తనిఖీ అధికారి ఎస్టీఎం గౌరీశంకర్, హెచ్ఆర్ మేనేజర్ డి.నరేష్, ఏరియా కోఆర్డినేటర్ మారుతి, ఏపీవో యు.భ్రమరాంబ,ఈసీ ఎం.బాలరాజు పాల్గొన్నారు.

డిజిటల్, మౌలిక వసతుల బలోపేతమే లక్ష్యం

నన్నయ వీసీ ప్రసన్నశ్రీ


ఎంవోయూ పత్రాలు పరస్పరం మార్చుకుంటున్న అధికార్లు

దివాన్‌చెరువు, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): యూనివర్శిటీ డిజిటల్, మౌలిక సదుపాయాలను బలోపేతం చేసి కార్యాచరణ సామర్థ్యంపెంచడం, విద్య, పరిపాలన అవసరాలకు మద్దతు ఇవ్వడం ఈ ఎంవోయూ లక్ష్యమని ఆది కవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. పింక్ మూన్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్‌తో నన్నయ వర్శిటీ ఎంవోయూ చేసుకుంది. మంగళవారం విశ్వవిద్యాలయంలో జరిగిన సమావేశంలో రిజిస్ట్రార్ ఆచార్య కేవీ స్వామి, పింక్ మూన్ టెక్నాలజీస్ సీఈవో టి.నాగమల్లేశ్వరరావు అవగాహన పత్రాలపై సంతకాలు చేసి పత్రాలు మార్చుకున్నారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఈ ఎంవోయూతో నన్నయ వర్శిటీలోని అన్ని ఐటీ, సాఫ్ట్‌వేర్ సంబంధిత ప్రక్రియలకు సాంకేతిక మద్దతు, కన్సల్టెన్సీ తోబాటు పరిష్కారాలను అందిస్తుందన్నారు. ఉమ్మడి ప్రాజెక్టులు, ఇంటర్న్‌షిప్‌లు, విద్యార్థులకు ప్రయోజనకరమైన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఐక్యూఏసీ డైరెక్టర్ వి.పెర్సిస్, లీగల్ అధికారి ఎన్.నాగేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

రక్షక భటులకే రక్షణ లేదా ?

ఇక సామాన్య ప్రజల పరిస్థితి ఏమిటి ? మాజీ ఎంపీ భరత్‌రామ్

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో ఆదివారం అర్ధరాత్రి జరిగిన ఘటన చూస్తుంటే అసలు రక్షక భటులకే రక్షణ లేకుండా పోయిందనే సంగతి అర్థమవుతున్నదని, ఇక సామాన్యుల పరిస్థితి ఏమిటని మాజీ ఎంపీ, వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మార్గాని భరత్‌రామ్ ప్రశ్నించారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ కోటిపల్లి బస్టాండు నుంచి మెయిన్‌రోడ్డు వరకూ తప్పతాగిన యువకులు సృష్టించిన వ్యవహారానికి బాధ్యులు ఎవరని, సిటీ ఎమ్మెల్యే దీనికి ఏం సమాధానం చెబుతారని పేర్కొన్నారు. ఇటువంటి బ్లేడ్‌బ్యాచ్‌లను గుర్తించి వారిపై రౌడీషీట్లు ఎందుకు తెరవడంలేదని, నగర బహిష్కరణ ఎందుకు చేయడం లేదని, ఎవరి ఒత్తిళ్ల పనిచేస్తున్నాయని ప్రశ్నించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక స్థానికంగానే ఎమ్మెల్యే మనుషులు యథేచ్ఛగా భూ సెంటిల్‌మెంట్‌లు చేస్తున్నారని భరత్‌రామ్ ఆరోపించారు.

నగర పరిశుభ్రతే ధ్యేయం

ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు
43, 44 డివిజన్లలో పారిశుధ్యం పరిశీలన


డ్రైనేజీ పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రజల ఆరోగ్యం, నగర పరిశుభ్రతే తమ ధ్యేయమని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అన్నారు. స్థానిక 43,44 డివిజన్లలో పారిశుధ్య పరిస్థితిని జనసేన నగర అధ్యక్షుడు వైశ్రీనుతో కలిసి ఆయన తనిఖీ చేశారు. డివిజన్లలో జరుగుతున్న పారిశుధ్య పనులను, మస్తరు కార్యాలయానికి వెళ్లి రికార్డులను పరిశీలించారు. స్థానికులతో మాట్లాడి పారిశుధ్యంపై ఆరా తీశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి డివిజన్‌లో ప్రతీ రోజు పారిశుధ్య పనులు పక్కాగా జరగాలని, డ్రైనేజీల డీసిల్టేషన్ చేయాలని, పారిశుధ్య నిర్వహణలో ఎలాంటి లోపం కనిపించినా చర్యలు తప్పవని శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బందిని హెచ్చరించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, నగర పాలక సంస్థ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎంఎల్‌టీ అప్రెంటిస్ సర్టిఫికెట్ల అందజేత

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ మెడికల్ కాలేజీ వద్ద జీజీహెచ్‌లో ఎంఎల్‌టీ అప్రెంటిస్ పూర్తిచేసిన 40 మందికి ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024 జూన్ 1 నుంచి 2025 మే 31 వరకూ అప్రెంటిస్ చేసిన 40 మంది విద్యార్థులకు సర్టిఫికెట్ల విషయంలో సమస్య తలెత్తడంతో ఆ సమస్య తన దృష్టికి రావడంతో పరిష్కరించామని అన్నారు. అప్రెంటిస్ పూర్తి చేసిన వారంతా సమాజానికి మేలు జరిగే సేవా కార్యక్రమాలు కూడా చేయాలన్నారు. ప్రతి విషయంలోనూ దుష్ప్రచారం చేయడం వైసీపీ నాయకులకు అలవాటుగా మారిందని, ప్రభుత్వ మెడికల్ కాలేజీల విషయంలోనూ అదే చేస్తున్నారని మండిపడ్డారు. తమ హయాంలో మెడికల్ కాలేజీలు తెచ్చామని గొప్పలకుపోతున్న వైసీపీ నాయకులు శాశ్వత భవనాలు ఎందుకు నిర్మించలేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తిరునాళ్ల పోస్టర్ ఆవిష్కరణ

నిడదవోలు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కోట సత్తెమ్మ ఆలయంలో జరిగే దసరా వేడుకల్లో భక్తులకు మెరుగైన సేవలు అందించాలని మంత్రి కందుల దుర్గేష్ అధికారులను ఆదేశించారు. మంగళవారం తిమ్మరాజుపాలెంలో కోట సత్తెమ్మ అమ్మవారి దేవస్థానంలో జరుగనున్న దసరా వేడుకలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు.

15 నుంచి గాలికుంటు వ్యాధి
నివారణకు టీకాలు

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో జాతీయ గాలి కుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం ఈనెల 15 నుంచి అక్టోబరు 15 వరకూ నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. మంగళవారం సాయంత్రం కలెక్టర్ ఛాంబర్‌లో 7వ విడత జాతీయ గాలి కుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి వ్యాక్సినేటర్ రైతుల ఇళ్ల వద్దకు వెళ్లి పశువులకు గాలి కుంటు నివారణ టీకాలు వేస్తారని, ప్రతి రైతు తమ పశువులకు తప్పనిసరిగా వేయించుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా పశుసంవర్థకశాఖాధికారి డాక్టర్ టి.శ్రీనివాసరావు, ముఖ్య ప్రణాళికాధికారి ఎల్.అప్పలకొండ పాల్గొన్నారు.

డయేరియా అదుపులోనే ఉంది

» ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి
» కొత్తకోటపాడులో బాధితులకు పరామర్శ


డయేరియా బాధితులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

రంగంపేట, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): డయేరియాపై రెండు రోజులుగా మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేసి బాధితులకు చికిత్స అందించి మెరుగైన వైద్య కోసం ప్రభుత్వాసుపత్రికి తరలించడంతో పరిస్థితి అదుపులోనే ఉందని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు.మండలంలోని కొత్తకోటపాడు గ్రామంలో వాంతులు, విరోచనాలతో అనారోగ్యం బారిన పడిన వారిని మంగళవారం ఆయన పరామర్శించారు.ఈ సందర్భంగా గ్రామంలో పర్యటించి మాట్లాడారు. అలాగే గ్రామాల్లో ఏమైనా వైరల్ ఫీవర్స్ వస్తున్నాయేమో దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. మంగళవారం కొత్త కేసులు నమోదు కాలేదని,డయేరియా బాధితులు నలుగురు లో ముగ్గురు పూర్తిగా కోలుకున్నారని, మరొకరికి షుగర్ ఉండడంతో పెద్దాపురం సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్నారని పీహెచ్‌సీ డాక్టర్ బి.వేణుశ్రీలక్ష్మీ తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, డీఎంహెచ్‌వో కె.వెంకటేశ్వరరావు డిప్యూటీ డీఎం హెచ్‌వో పి.సరిత, రంగంపేట పీహెచ్‌సీ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సేవా పక్షోత్సవాలను జయప్రదం చేయండి

అనపర్తి, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ జన్మదినం సందర్భంగా ఈనెల 17 నుంచి వచ్చే నెల 2 వరకు జరిగే సేవా పక్షోత్సవాలను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక ఎన్డీయే కార్యాలయంలో ఆయన బీజేపీ శ్రేణులతో సమావేశం నిర్వహించారు.సేవా పక్షోత్సవాలను ఘనంగా నిర్వహించాలన్నారు. ఆపరేషన్ సిందూర్‌తో భారత్ ఎంత శక్తివంతమైనదో మోదీ ప్రపంచానికి చాటిచెప్పారన్నారు. సమావేశంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లిడి సురేంద్రరెడ్డి, గొల్లు హేమతులసి, అనపర్తి, బిక్కవోలు, రంగంపేట, పెదపూడి మండలాల అధ్యక్షులు కర్రి బులిరెడ్డి, గుడిమెట్ల దుర్గారెడ్డి, ఎం.సాయిరామ్, కె.శివ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

బిక్కవోలు, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): మెళ్లూరు గ్రామానికి చెందిన జాజుల శివశంకర్(36) మద్యం మత్తులో పురుగుల మందు డబ్బాలో నీళ్లు పోసుకుని తాగి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్ఐ వి.రవిచంద్రకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటక రాష్ట్రం రాయచూర్ జిల్లా మాల్దాకు చెందిన హెర్మావతితో శివశంకర్‌కు ఏడేళ్ల క్రితం వివాహమయ్యిందన్నారు. వారికి ఒక కుమారుడు ఉన్నాడు. అయితే గత నెల 31న శివశంకర్ వినాయక నిమజ్జనం పూర్తయిన తరువాత మద్యం మత్తులో ఇంటికి వచ్చి గడ్డిమందు బాటిల్‌లో నీళ్లు పోసుకుని తాగడంతో వెంటనే వియ్యంకుడు స్థానిక ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చారు. ఎంతకూ నయం కాకపోవడంతో భార్య ఈనెల 8న కాకినాడలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చగా చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడని దీనిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

వైద్యుల సలహాలు పాటించి త్వరగా కోలుకోవాలి

జీజీహెచ్‌లో మానసిక చికిత్సా కేంద్రాన్ని సందర్శించిన డీఎల్ఎస్ఏ కార్యదర్శి శ్రీలక్ష్మి



రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): మానసిక సమస్యలతో చికిత్స పొందుతున్న వారు వైద్యుల సలహాలు పాటిస్తూ తగిన ఆరోగ్యజాగ్రత్తలు తీసుకుంటే త్వరగా కోలుకోవచ్చని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ(డీఎల్ఎస్ఏ) కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎన్.శ్రీలక్ష్మి అన్నారు. రాజమహేంద్రవరం ప్రభుత్వ బోధనాసుపత్రిలోని మానసిక చికిత్సా కేంద్రాన్ని ఆమె మంగళవారం సందర్శించారు. అక్కడ చికిత్స పొందుతున్న వారికి అందుతున్న వైద్యసేవలు, ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీశారు. చికిత్స పొందుతున్న వారితోను, వారి కుటుంబ సభ్యులతోను మాట్లాడారు. ఈ సందర్భంగా శ్రీలక్ష్మి మాట్లాడుతూ మానసిక రుగ్మతల నుంచి పూర్తిగా ఉపశమనం పొందిన వారిని తిరిగి కుటుంబ సభ్యులతో కలిపేందుకు చర్యలు తీసుకోవాలని, ఎలాంటి న్యాయ సహాయం అవసరమైనా డీఎల్ఎస్ఏ ద్వారా అందిస్తామన్నారు. అనంతరం గౌతమీ జీవ కారుణ్య సంఘం వృద్ధాశ్రమాన్ని సందర్శించి అక్కడి వసతులు, సదుపాయాలను పరిశీలించారు. వృద్ధులతో మాట్లాడి ప్రభుత్వ పథకాలను వివరించారు. ఎటువంటి న్యాయ సహాయం కావాలన్నా తమకు తెలియజేయాలన్నారు.

అకడమిక్ ఫోరమ్ సభ్యులు.. పాఠశాలల తనిఖీ

బిక్కవోలు, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు పాఠశాలలను మంగళవారం మండల అకడమిక్ ఫోరమ్ సభ్యులు తనిఖీలు జరిపారు. ఈ సందర్భంగా ప్రాథమిక పాఠశాలలను, ఉన్నత పాఠశాలలను వేర్వేరు బృందాలు తనిఖీ చేశాయి. బిక్కవోలు ఆదర్శ ప్రాథమిక, తుమ్మలపల్లి ప్రాథమిక, ఇళ్లపల్లి ఆదర్శ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా వారు విద్యార్థుల వర్క్‌బుక్స్, ఎఫ్ఏ-1 అసెస్‌మెంట్ బుక్స్, టీచర్స్ హ్యాండ్‌బుక్స్, టీఎల్ఎం, విద్యాప్రవేశ్, ఎఫ్ఎల్ఎన్, లీప్ యాప్, ప్రతి శనివారం నిర్వహించే నోబ్యాగ్‌డే కృత్యాలు, డైరీ ప్రాక్టీస్ రైటింగ్ వంటివి పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యాలు మెరుగుపరచేందుకే ఈ తనిఖీలు నిర్వహిస్తున్నామని ఎంఈవో సీహెచ్‌వీవీ సత్యనారాయణ తెలిపారు.కాంప్లెక్స్ హెచ్ఎం పీవీ ప్రభాకరరావు, హెచ్ఎం పి.శ్రీనివాసరెడ్డి, ఏడుగురు సబ్జెక్ట్ టీచర్లు, ఐదుగురు ఎస్జీటీలు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న ఉద్యోగులకు సత్కారం

అనపర్తి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పదోన్నతితో మరిన్ని సేవలు అందించేందుకు వీలు ఏర్పడుతుందని అనపర్తి ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ తాడి రామగురెడ్డి అన్నారు. ఏరియా ఆసుపత్రిలో దంత వైద్యురాలు చేస్తున్న డాక్టర్ భాగ్యలక్ష్మి డీడీఎస్‌గా పదోన్నతి పొంది రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి బదిలీ కాగా, డాక్టర్ ఎం.వాణి డిప్యూటీ సివిల్ సర్జన్‌గా పదోన్నతి పొంది కొవ్వూరు సీహెచ్‌సీకి బదిలీ అయ్యారు. అలాగే స్టాఫ్ నర్సులుగా చేస్తున్న విమలకుమారి హెడ్ నర్సుగా గోకవరం సీహెచ్‌సీకి,వెంకటరమణ రంపచోడవరం ఆసుపత్రికి హెడ్ నర్సుగా బదిలీ అయ్యారు. ఈ నలుగురిని మంగళవారం ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో సీఎస్ ఆర్ఎమ్‌వో డాక్టర్ పద్మశ్రీ, అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ తరుణ్, వైద్యులు మాణిక్యాంబ, కరుణశ్రీ పాల్గొన్నారు.

యూరియా కోసం రోజంతా పడిగాపులు


యూరియా కోసం కోరుకొండ సొసైటీ వద్ద రైతుల పడిగాపులు

కోరుకొండ, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అన్నదాతలకు యూరియా కష్టాలు పూర్తిగా తొలగలేదు. బస్తా యూరియా కోసం రోజంతా రైతులు పనులు మానుకుని సహకార సంఘాల వద్ద పడిగాపులు కాస్తున్నారు. 10 గ్రామాల పరిధిలోని కోరుకొండ సొసైటీకి సోమవారం 20 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చింది. ఈ విషయం తెలుసుకున్న 10 గ్రామాల రైతులు సొసైటీ చేరుకున్నారు. డిమాండ్ ఎక్కువ సప్లై తక్కువగా ఉండడంతో ఆధార్ కార్డు, పట్టాదారు పాస్ బుక్ జిరాక్స్ తీసుకుని లైన్‌లో ఉంటే ఉన్న యూరియాను రైతుకు రెండు బస్తాలు చొప్పున ఇస్తామని సొసైటీ ఇబ్బంది చెప్పడంతో ఈ రెండుబస్తాల యూరియా కోసం 10 ఎకరాల వరినాట్లు వేసిన రైతులు కూడా రోజంతా పడిగాపులు కాస్తున్నారు. తాము మంగళవారం కూడా ఉదయం నుంచి సాయంత్ర వరకు ఇదే పరిస్థితి సొసైటీ వద్ద కనిపించింది.

నిల్వలు ఎక్కడున్నాయో చెప్పండి

మండలానికి 1600 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేశామని, అవసరమైన మేరకు నిల్వలు ఉన్నాయని రైతులు ఆందోళన చెందవద్దని వ్యవసాయ అధికారులు 15 రోజులుగా ప్రకటనలు గుప్పిస్తున్నారు. అయితే ప్రకటనలకు వాస్తవ పరిస్థితులకు సంబంధం కనిపించడం లేదు. వ్యవసాయాధికారులు చెపుతున్న యూరియా నిల్వలు ఎక్కడ ఉన్నాయో చెబితే అక్కడకు పోయి తెచ్చుకుంటామని రైతులు అంటున్నారు. రైతుకు అవసరమైన యూరియాలో ఇప్పటి వరకు 60శాతం మాత్రమే వచ్చింది. ఇంకా 40శాతం యూరియా రైతులకు అందాల్సి ఉంది.

నేత కార్మికుల ఉచిత విద్యుత్‌కు కృషి: ఎంపీపీ

కడియం, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): నేత కార్మికులకు ప్రకటించిన ఉచిత విద్యుత్ జీవోపై కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎంపీపీ వెలుగుబంటి వెంకటసత్యప్రసాద్ తెలిపారు. మండలంలో వివిధ గ్రామాలకు చెందిన నేత కార్మికులు మంగళవారం ఎంపీపీ ప్రసాద్‌ను కలిసి తమకు ప్రభుత్వం ప్రకటించిన ఉచిత విద్యుత్ జీవో అమలు కాలేదని తెలిపారు. దీనిపై ఎంపీపీ ప్రసాద్ స్పందిస్తూ విద్యుత్‌శాఖ అధికారులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం దీనిపై ఓ జీవోను విడుదల చేస్తుందని, అది వచ్చిన వెంటనే అమలు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో నేత కార్మికులు కర్రా వీరభద్రరావు, యర్రా వీరభద్రుడు, గుత్తి నందికేశ్వరరావు, బత్తుల గణేష్, దొంతంశెట్టి శ్రీను, గోరు నాగేశ్వరరావు, అల్లక సత్యనారాయణ పాల్గొన్నారు.

యూరియా వాడకంపై అవగాహన సదస్సు


సీతానగరంలో అవగాహన కల్పిస్తున్న అధికారులు

సీతానగరం/రంగంపేట, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి) యూరియా, నానో యూరియా వినియోగంపై అవగాహన సదస్సులు నిర్వహించారు. సీతానగరం మండల సమైఖ్య భవనంలో మహిళా సంఘాలకు, రంగంపేట మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ సంఘ సహాయకులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ యూరియా వ్యవసాయానికి కాకుండా ఇతర అవసరాలకు చేపల చెరువులు, ప్లేవుడ్ ఇండస్ట్రీస్‌లో వాడకూడదన్నారు.యూరియా అధికంగా వాడడం వల్ల నీరు కలుషితమవుతుందని, భూమి సారం కోల్పోతుందని చెప్పారు. దీనిని అధిగమించడానికి నానో యూరియా ప్లస్ ఎకరానికి 500ఎంఎల్ పిచికారీ చేయాలన్నారు.తెగుళ్ల నివారణకు సుడోమోనస్, పురుగుల నివారణకు వేప గింజల కషాయం పిచికారీ చేయాలన్నారు. సదస్సు అనంతరం రంగంపేటలో వ్యవసాయ కళాశాల విద్యార్థులు, సిబ్బంది, రైతులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమాల్లో ఏవోలు గౌరీదేవి, కె.శ్రీనివాసరావు తహశీల్దార్ ఎ.శ్రీనివాస్ పాల్గొన్నారు.

'పుష్కరాలకు బీసీ,ఎస్సీ,ఎస్టీ,మైనార్టీ సంఘం
ప్రతిపాదనలు పరిశీలించండి'

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): గోదావరి పుష్కరాలు-2027 నిర్వహణకు తమ సంఘం చేసిన ప్రతిపాదనలను ప్రభుత్వం పరిశీలించాలని రాష్ట్ర బీసీ,ఎస్సీఎస్టీ మైనార్టీ సంక్షేమ సంఘం వ్యవస్థాపకుడు సానబోయిన రామారావు విజ్ఞప్తి చేశారు.ఈ మేరకు మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. 2015లో జరిగిన దుర్ఘటనలు వంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. స్థానిక పరిస్థితులు తెలిసిన అర్బన్, రూరల్ ఎమ్మెల్యేలకు నిర్వహణ కమిటీలో కీలక బాధ్యతలు అప్పగించాలని, అందుకోసం కేబినెట్‌లోకి తీసుకుంటే పనులతో పాటు, నిర్వహణలో కీలకంగా వ్యవహరిస్తారన్నారు. బీసీ ఎస్సీలకు కల్యాణ మండపాలు నిర్మించాలన్నారు.నగరంలో అభివృద్ధి పనులతో పాటు, తీసుకోవాల్సిన చర్యలతో 6నెలల క్రితం ప్రతిపాదనలు చేశామని వాటిని పరిగణలోకి తీసుకోవాలన్నారు.

ప్రత్యేక అవసరాల పిల్లలకు వైద్య శిబిరం

ధవళేశ్వరం, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రత్యేక అవసరాల పిల్లలకు వైద్య శిబిరం నిర్వహించి రూరల్ నియోజకవర్గ పరిధిలో 81 మంది పిల్లలకు ఉపకరణాలు అవసరమని గుర్తించినట్టు సమగ్ర శిక్ష ప్రాజెక్టు కో ఆర్డినేటర్ ఎస్.సుభాషిణి తెలిపారు. మంగళవారం ధవళేశ్వరం జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గ పరిధిలోని ప్రత్యేక అవసరాల పిల్లలు, తల్లిదండ్రులు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ సోము వీర్రాజు విచ్చేసి మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సేవలను వినియోగించుకుని ప్రత్యేక అవసరాల పిల్లలు సాధారణ జీవనం గడిపే విధంగా అధికారులు, తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. శిబిరానికి 200 మంది పిల్లలు హాజరు కాగా వైద్య పరీక్షలు నిర్వహించారు.

సే నో టు ప్లాస్టిక్

రాజమహేంద్రవరం కల్చరల్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): జేసీఐ అంతర్జాతీయ అవగాహన కార్యక్రమంలో భాగంగా రెండు వందల మంది ఆదిత్య విద్యా సంస్థల ఎన్ఎస్ఎస్, యూత్ రెడ్‌క్రాస్ వలంటీర్లు మంగళవారం ర్యాలీ చేపట్టారు. స్థానిక ఆదిత్య కళాశాల నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ మీదుగా వెంకటేశ్వర మార్కెట్ నుంచి మహిళా డిగ్రీ కళాశాల వరకు సే నో టు ప్లాస్టిక్ అంటూ ర్యాలీ జరిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సీహెచ్ ఫణికుమార్,జీవీఎస్ నాగేశ్వరరావు, బీహెచ్‌వీ రమాదేవి, ఆకుల శిరీష, జేసీఐ జిల్లా అధ్యక్షుడు రాజీజైన్, ప్రియంక అనసూరి,రాహుల్, తదితరులు పాల్గొన్నారు.

కాలిన గాయాలతో
మహిళ మృతి

బిక్కవోలు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మెళ్లూరు గ్రామానికి చెందిన కొమ్మన శేషరామలక్ష్మి(45) కాలిన గాయాలతో మృతి చెందింది. బిక్కవోలు ఎస్ఐ వి.రవిచంద్రకుమార్ తెలిపిన వివరాల ప్రకారం..ఈనెల 2న రామలక్ష్మి ఇంటిలో వంట చేస్తుండగా ఫిట్స్ రావడంతో చీర అంటుకుని గాయాల పాలయ్యిందన్నారు. దీంతో ఆమెను కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందిందన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు.

సినిమా గైడ్

(రాజమహేంద్రవరం)

శ్యామల	: ఘాటీ
సూర్యమినీ	: ది కంజ్యూరింగ్
సూర్యప్యాలస్	: ఘాటీ
స్వామి	: కూలీ
అనుశ్రీ(సాయికృష్ణ)	: మదరాసి
శివజ్యోతి	: ది బెంగాల్ ఫైల్స్
రాజా	: మదరాసి
ఊర్వశి	: లిటిల్ హార్ట్స్
మేనక	: ది కంజ్యూరింగ్
రంభ	: మహావతార్ నరసింహ
అప్సర	: కొత్తలోక
అశోక	: మదరాసి
పీఎస్ మహల్(నామవరం)	: ఘాటీ
మురళీకృష్ణ(ధవళేశ్వరం	: ఘాటీ, మదరాసి
వెంకటసూర్య(కడియం)	: మదరాసి, ఘాటీ
సత్యగౌరి (అనపర్తి)	: మదరాసి
సూర్యశ్రీ (అనపర్తి)	: ఘాటీ
ఫార్చ్యూన్ సినిమాస్(రాజానగరం)	: మదరాసి, కొత్తలోక
రామకృష్ణ(కోరుకొండ)	: మహావతార్ నరసింహ
గీతాసినిమాస్ (సీతానగరం)	: మహావతార్ నరసింహ
శ్రీనివాస (గోకవరం)	: ఘాటీ
టీడీ సినీ మ్యాక్స్ (గోకవరం)	: మదరాసి
లలితామహల్(రంపచోడవరం)	: మహావతార్ నరసింహ
నవయుగ(చింతూరు)	: హరిహర వీరమల్లు





విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి దుర్గేష్

యూరియా కేటాయింపు పారదర్శకత కోసం జేసీ ఆధ్వర్యంలో కమిటీ : కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం రూరల్, సెప్టెంబరు9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో యూరియా కేటాయింపును పారదర్శకంగా నిర్వహించేందుకు జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేస్తున్నట్టు కలెక్టర్ ప్రశాంతి తెలిపారు. మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో సమన్వయ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కమిటీలో వ్యవసాయ, సహకార, ఉద్యానవన, పశుసంవర్ధక శాఖాధికారులు, మార్క్‌ఫెడ్ డీఎం సభ్యులుగా ఉంటారన్నారు. ఎంత యూరియా అవసరమో కమిటీ సిఫారసు చేస్తుందని, ఆమేరకు కేటాయింపులు జరుగుతాయన్నారు. కేటాయింపు తరువాత నిల్వలను సహాయ రిజిస్ట్రార్ తప్పనిసరిగా తనిఖీ చేయాలన్నారు. ప్రతి రైతు సేవా కేంద్రాల వారీగా రికార్డులు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. యూరియా సక్రమంగా రైతు సేవా కేంద్రాలకు చేరిందా లేదా అన్నది వ్యవసాయాధికారి పరిశీలించాలన్నారు. సరఫరా చేసిన యూరియా వినియోగాన్ని వ్యవసాయ సహాయకులు తనిఖీ చేసి కనీసం 10 శాతం క్షేత్ర స్థాయిలో నిర్ధారణ జరపాలని ఆదేశించారు. అలానే ఒక రైతు సేవా కేంద్రం నుంచి మరొక కేంద్రానికి యూరియా తరలించాలంటే మండల వ్యవసాయాధికారి అనుమతి తప్పనిసరి అని స్పష్టంచేశారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు, జిల్లా సహకార అధికారి ఎం. వెంకటరమణ, ఉద్యాన శాఖ అధికారి ఎస్.మల్లిఖార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

నిడదవోలు సమగ్రాభివృద్ధే ధ్యేయం : మంత్రి దుర్గేష్

నిడదవోలు, సెప్టెంబరు 9, (ఆంధ్రజ్యోతి): నిడదవోలు సమగ్రాభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నానని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫి శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. మంగళవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిడదవోలు శాసనసభ్యునిగా ఏడాదికాలంలో సుమారు రూ.300 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని, మరో రూ.150 కోట్ల పనులు జరుగుతున్నాయన్నారు. నిడదవోలు పట్టణంలో రూ.105.85 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. మునిసిపాలిటీ సాధారణ నిధుల నుంచి రూ.15.75 కోట్ల నిధులతో 240 అభివృద్ధి పనులు ప్రారంభించగా ఇప్పటికే రూ.8.12 కోట్ల నిధులతో 187 పనులు పూర్తి చేశామన్నారు. 15వ ఆర్థిక సంఘం ద్వారా రూ.4.50 కోట్లు విడుదల కాగా, వీటి ద్వారా వ్యర్థాల నిర్వహణ, తాగునీటి సరఫరా, డ్రైన్స్ శుభ్రత పనులు జరుగుతున్నాయన్నారు. పట్టణంలో ఉన్న 30 పడకల ఆసుపత్రిని వంద పడకల ఆసుపత్రిగా తీర్చిదిద్దుతామని, ఇప్పటికే ఆధునికీకరణ పనులు జరుగుతున్నాయన్నారు. ప్రభుత్వంతో చర్చించి 2024లో ఎర్రకాలువ ముంపునకు గురైన 3071.41 హెక్టార్లలో పంట నష్టపోయిన 4631 మందికి 5.22 కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీ విడుదల చేయించామన్నారు. పర్యాటక శాఖామంత్రిగా అఖండ గోదావరి ప్రాజెక్టులో నిడదవోలును అంతర్భాగం చేసి రూ.4 కోట్లతో పర్యాటక రంగ అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. మునిసిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ పాల్గొన్నారు.

కొద్దిరోజులు.. ఆగుదాం!



- వాహనాలపై జీఎస్టీ తగ్గింపు ఫలితం
- నిలిచిన కార్లు, ద్విచక్ర, త్రిచక్ర వాహనాల కొనుగోళ్లు
- ముందస్తు బుకింగ్‌లు
- 22 నుంచి కొనేందుకు ఏర్పాట్లు
- విజయదశమికి భారీగా అమ్మకాలు జరిగే అవకాశం

వాహనాలపై జీఎస్టీ తగ్గిస్తూ కేంద్రం తీసుకున్న నిర్ణయంతో కొనుగోళ్లు నిలిచిపోయాయి. ఇక కొద్ది రోజులే కదా వేచి చూద్దాం అనే ధోరణి, ఆపై విజయదశమి దగ్గరగా ఉండడంతో అప్పుడు కొందామనే ఆలోచనతో అందరూ బ్రేక్ ఇచ్చేశారు. ఫలితంగా కేంద్రం ప్రకటన వచ్చిన నాటి నుంచి కార్లు, ద్విచక్ర, త్రిచక్ర వాహనాలు దాదాపుగా నిలిచిపోయి షోరూంల్లో సందడి కనిపించడం లేదు. ఈ సమయంలోనే పలు వాహన కంపెనీలు ఆఫర్లపై ఆఫర్లు ప్రకటిస్తూ వినియోగదారులను ఆకట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి.

(ఆంధ్రజ్యోతి-పిఠాపురం)

జీఎస్టీ సంస్కరణల్లో భాగంగా కేంద్ర ప్రభుత్వం చేసిన ప్రకటనతో అన్ని రకాల వాహనాల ధరలు తగ్గనున్నాయి. జీఎస్టీ తగ్గింపు నిర్ణయం ఈనెల 22వ తేదీ నుంచి అమలుల్లోకి రానున్న నేపథ్యంలో ప్రస్తుతం వాహనాల కొనుగోలు చేయాలని భావించిన వారంతా తమ నిర్ణయాలను వాయిదా వేసుకున్నారు. ఇప్పటికే అన్ని రకాల కార్లు, ద్విచక్ర వాహనాల ధరలను తగ్గిస్తున్నట్టు కంపెనీలు ప్రకటించాయి. ఒకటి రెండు కార్ల కంపెనీలు పోటీకి తెరలేపుతూ జీఎస్టీ తగ్గింపును ముందస్తుగానే వినియోగదారులకు వర్తింపజేస్తామంటూ ప్రకటనలు ఇస్తూ ఆకట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఇక ద్విచక్ర వాహనాలతో పాటు కార్లు, ఎస్‌యూవీలు ఇతర వాహనాలపై విధించే జీఎస్టీని తగ్గిస్తున్నట్టు కేంద్రం ప్రకటించింది. ఇందులో భాగంగా 350 సీసీ, అంతకంటే తక్కువ కెపాసిటీ కలిగిన ద్విచక్ర వాహనాలపై ప్రస్తుతం ఉన్న 28 శాతం జీఎస్టీని 18 శాతానికి తగ్గించారు. దీంతో వాహనాల ధరలు రూ.8 వేల నుంచి రూ.23 వేల వరకూ తగ్గే అవకాశం ఉంది. అలాగే 1200 సీసీ అంతకంటే తక్కువ సామర్థ్యం కలిగిన పెట్రోల్, పెట్రోల్ హైబ్రిడ్, ఎల్‌పీజీ, సీఎన్‌జీ కార్లు, 1500 సీసీలోపు ఉన్న డీజిల్, డీజిల్ హైబ్రిడ్ కార్లపై ఇప్పటివరకూ 28 శాతం జీఎస్టీ ఉండగా దానిని 18 శాతానికి తగ్గించారు. ఇదే రీతిలో మధ్యశ్రేణి, ఉన్నతశ్రేణి ఎస్‌వీయూలపై ఇప్పటివరకూ జీఎస్టీ 28 శాతం, సెస్‌లతో కలుపుకుని 45 నుంచి 50 శాతం వరకూ పన్నులు చెల్లించాల్సి వచ్చేది. జీఎస్టీని 28 నుంచి 40 శాతానికి పెంచారు. సెస్‌లను మినహాయించారు. దీంతో పన్నులు 5-10 శాతం వరకూ తగ్గనున్నాయి. ఈ నేపథ్యంలో కార్ల ధరలు కనిష్ఠంగా రూ.30 వేల నుంచి గరిష్ఠంగా రూ.4.50 లక్షల వరకూ తగ్గనున్నాయి. ఇదే విషయాన్ని తెలుపుతూ మారుతి సుజుకి, టాటా మోటార్స్, హ్యుందయ్, ఎంజీ, కియా, హోండా తదితర కార్ల కంపెనీలు ఇప్పటికే అధికారికంగా ప్రకటనలు కూడా విడుదల చేశాయి.

అమ్మకాలకు బ్రేక్

కేంద్రం జీఎస్టీ పన్నుల శ్లాబుల్లో మార్పులు చేస్తుందనే సమాచారం వచ్చిన నాటి నుంచి వాహనాలు కొనుగోళ్లు మందగించాయి. అధికారిక ప్రకటన వచ్చిన తర్వాత దాదాపుగా అమ్మకాలు నిలిచిపోయాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా గల కార్లు, ద్విచక్రవాహనాల షోరూంల్లో కొద్ది రోజులుగా కొనుగోళ్లు జరగడం లేదు. ఈనెల 21వ తేదీ వరకూ ఇదే పరిస్థితి కొనసాగనున్నది. 22వ తేదీ నుంచి జీఎస్టీ తగ్గింపు అమల్లోకి వస్తున్న నేపథ్యంలో ఆ తర్వాతే కొనుగోళ్లు జరపాలని వినియోగదారులు భావిస్తుండడమే ఇందుకు కారణంగా చెబుతున్నారు. సాధారణంగా కాకినాడ జిల్లాలో ప్రతి నెలా సగటున 2 వేల నుంచి 3 వేల వరకూ ద్విచక్ర వాహనాలు, 300-450 వరకూ కార్లు విక్రయాలు జరుగుతాయి. తూర్పుగోదావరి జిల్లాలో 2,200 నుంచి 2,800 వరకూ ద్విచక్ర వాహనాలు, 300-500 వరకూ కార్లు, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ప్రతి నెలా 1800 నుంచి 2,500 వరకూ ద్విచక్ర వాహనాలు, 300నుంచి 500 వరకూ కార్లు విక్రయాలు జరుగుతాయి. విజయదశమి, దీపావళి, సంక్రాంతి, ఉగాది తదితర పండుగల సమయాల్లో వీటి విక్రయాలు రెట్టింపుపైగా ఉంటాయి.

ముందస్తు బుకింగ్‌లపై దృష్టి

ఇప్పుడు ద్విచక్ర, త్రిచక్ర వాహనాలు, కార్ల కంపెనీలతోపాటు షోరూంల నిర్వాహకులు కొనుగోలుకు ఆసక్తి చూపించే వారి వద్ద నుంచి ముందస్తు బుకింగ్‌లు కోసం ప్రయత్నిస్తున్నాయి. ఇందుకోసం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పలు షోరూంలు ఆఫర్లు ప్రకటించాయి. తమ వద్ద కొనుగోలు చేసే వారికి యాక్సిసరీలు ఉచితంగా ఇస్తామంటూ ఆకట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఒకటి రెండు కార్ల కంపెనీలు తమ కార్లు ఇప్పుడు కొనుగోలు చేసినా జీఎస్టీ తగ్గింపు వర్తింపజేస్తామంటూ ప్రకటనలు జారీ చేశాయి. సాధ్యమైనంత వరకూ ఎక్కువమందికి తమ వాహనాలు విక్రయించేందుకు సంప్రదింపులు చేస్తున్నారు.

విజయదశమికి ఫుల్‌జోష్

ఈసారి విజయదశమికి వాహనాల కొనుగోళ్లు అధికంగా ఉంటాయని భావిస్తున్నారు. గతంతో పోల్చుకుంటే ఇప్పుడు అమ్మకాలు 100 శాతంపైగా పెరుగుతాయని చెబుతున్నారు. ఎప్పటి నుంచో బైక్‌లు, కార్లు కొనుగోలు చేయాలని భావించేవారు ఈనెల 22వ తేదీ నుంచి తగ్గను న్న ధరలతో కొనేందుకు మొగ్గు చూపే అవ కాశం ఉంది. విజయదశమి పర్వదినాన వాహనాలు కొనుగోలు చేస్తే కలిసి వస్తుందనే నమ్మకంగా ఎక్కువమంది ఆ రోజున వాహనాలు కొనుగోలు చేస్తూ ఉంటారు. ఈ సెంటిమెంట్, ధరల తగ్గడం అమ్మకాలు పెరిగేందుకు దోహదం చేస్తాయని వాహన షోరూంల ప్రతినిధులు చెప్పారు. ఇప్పటికే పలువురు వాహనాల ధరలు ఏ మేర తగ్గాయి, ఎటువంటి ఆఫర్లు ప్రకటించారు తదితర విషయాలను ఆరా తీస్తున్నారని వారు తెలిపారు. మార్కెట్‌లో పోటీ తట్టుకునేందుకు ఆఫర్లు ప్రకటించక తప్పదని వారు చెబుతున్నారు. మరోవైపు వాహనాలు కొనుగోలు చేయాలని భావిస్తున్న వారు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో రేట్లు ఎక్కడ తక్కువగా ఉన్నాయి, ఏయే ఆఫర్లు ఇస్తున్నారు తెలుసుకుని మరీ కొనాలని భావిస్తుండడం విశేషం. జీఎస్టీ తగ్గింపు వల్ల భవిష్యత్తులో విక్రయాలు పెరిగే అవకాశమున్నా ప్రస్తుతం మాత్రం నిలిచిపోయాయి.

రూ. లక్ష.. దాటేసి..



10 గ్రా.బంగారం 22 క్యారెట్ రూ.1,01,100.. గత జనవరిలో రూ.71,500

కిలో వెండి ధర రూ.1లక్షా 28 వేల 900... జనవరి నాటి ధర రూ.88,400

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

బంగారం ధరలు మిడిసి పడుతున్నాయి. ఈ ఏడాది జనవరి నుంచి బాగా పెరుగుదల మొదలైంది. ఇక తగ్గేదేలే అన్నట్టు ముందుకు పోతోంది. అపుడప్పుడు అటూఇటూ వెనకడుగు వేసినట్టు కనిపించినా, మళ్లీ పరుగుపెడుతోంది. జనవరి నుంచి ఇప్పటికి సుమారు ఎనిమిది నెలల కాలంలో 22 క్యారెట్ బంగారం ధర ఏకంగా రూ.30 వేలు అదనంగా పెరిగింది. 24 క్యారెట్ బంగారం 10 గ్రాముల ధర సుమారు 33 వేల వరకూ పెరుగుదల కనిపిస్తోంది. వెండి ధర కూడా విపరీతంగా పెరిగింది. వెండి ధర సుమారు 40 వేల వరకూ పెరిగిపోయింది. మంగళవారం రాజమండ్రి మార్కెట్‌లో బంగా బంగారం 22 క్యారెట్ 10 గ్రాములు ధర రూ.లక్ష దాటేయడం గమనార్హం. 24 క్యారెట్ బంగారం ధర ఎపుడో రూ.లక్ష దాటేసిన సంగతి తెలిసిందే. ఎక్కువ మంది 22 క్యారెట్ బంగారమే కొంటారు. వస్తువులు కూడా ఇవే ఉంటాయి. ఇవాళ 10 గ్రాముల 22 క్యారెట్ బంగారం రూ.1,01,100 కి చేరింది. అంటే కేవలం ఒక గ్రాము బంగారం 10వేల110 కావడం గమనార్హం. సామాన్యుడు చిన్న బంగారం వస్తువును కూడా కొనుగోలు చేసుకునే పరిస్థితి లేనట్టే. 10 గ్రాముల 24 క్యారెట్ ధర రూ.1,10,290 చేరింది. ఇదంతా రికార్డు స్థాయి ధరలు. ప్రజలకు అందుబాటు కాని ధరలు. పేద, మధ్యతరగతి ప్రజలు బంగారం అంటే కలలోనే చూసే వస్తువుగా మారిపోయింది. ఇంతవరకూ బంగారం కొనుగోలు చేసిన వారి పంట బాగా పండినట్టే. జనవరికి ముందుకు కొనుగోలు చేసినవారికే బాగా మిగిలినట్టే చెప్పవచ్చు. బ్యాంకుల్లో రుణాలు కూడా అధికంగా బాగా వస్తాయి.

● వెండిదీ అదే బాట

ప్రస్తుతం రాజమహేంద్రవరం మార్కెట్ కిలో వెండి ధర రూ.1 లక్షా 28వేల 900గా ఉంది. ఇది ఇలా ఎంత ధరకు పెరిగిపోతుందో చెప్పలేం. ఒకవేళ తగ్గితే వందో రెండొందలో తగ్గుతోంది. పెరిగితే వేలల్లో పెరిగిపోతోందని వినియోగదారులు వాపోతున్నారు. జనవరి 1న వెండి ధర కిలో 88,400గా ఉండగా ఆ తర్వాత ధర భారీగా పెరిగిపోయింది. జనవరి నుంచి ఇప్పటివరకూ వెండి ఏకంగా రూ.40,500 పెరిగింది. డబ్బున్నవారు బంగారం, వెండి కొనడానికి వెనకాడకపోయినా, సామాన్యులు మాత్రం కళ్లు తేలేస్తున్నారు.

పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టిపెట్టాలి



సీసీ కెమెరాల నిఘా పెంచాలి

జీజీహెచ్ అధికారుల సమీక్షలో కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు9, (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం ప్రభుత్వ బోధనాసుపత్రి (జీజీహెచ్)లో ఎల్లపుడూ పరిశుభ్రత కొనసాగేలా అధికారులు ప్రత్యేక దృష్టిపెట్టాలని, దొంగతనాలు అరికట్టడానికి సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. నవజాత శిశువుల ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (ఎన్‌ఐసీయూ) ఏర్పాటును వేగవంతం చేయాలని స్పష్టంచేశారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లో జీజీహెచ్ అధికారులతో సమావేశమై కొత్త విభాగాల ఏర్పాటు, ఆసుపత్రిలో మౌలిక సదుపాయాల అభివృద్ధి, పారిశుధ్య పరిరక్షణ వంటి అంశాలపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భద్రతా సిబ్బంది లోనికి వచ్చేవారి, బయటకు వెళ్లేవారి వివరాలు రిజిస్టర్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. భద్రతా సంస్థలు ఈ బాధ్యతను పూర్తిస్థాయిలో నిర్వర్తించేలా పర్యవేక్షణ వ్యవస్థ ఏర్పాటు చేయాలన్నారు. జీజీహెచ్ లేఅవుట్ మాస్టర్ ప్లాన్ ప్రకారం ఆసుపత్రి ప్రధాన ద్వారం వద్ద ఆర్చ్ నిర్మించాలని, ఆసుపత్రికి ఒకటి లేదా రెండు మాత్రమే ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇతర మార్గాలను బారికేడ్లు వేసి మూసివేయాలన్నారు. అవుట్‌పేషెంట్ సేవలు సమయానికి ప్రారంభమయ్యేలా టోకెన్ కౌంటర్లు పెంచాలని, న్యూరో సర్జరీ విభాగానికి అవసరమైన తాత్కాలిక సాంకేతిక నిపుణులను నియమించి సేవలు అందుబాటులోకి తేవాలన్నారు. మృతదేహాలను తరలించడానికి మహాప్రస్థానం వాహనాలతోపాటు ప్రైవేటు వాహనాలనూ ఎంపానెల్ చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమీక్షలో ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యలక్ష్మి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.భాస్కర్‌రెడ్డి, ఆర్ఎంవో డాక్టర్ ఆర్‌వీ సుబ్బారావు పాల్గొన్నారు.

అమ్మా! కాలువలోకి దూకేస్తున్నా..

- వేమగిరి వద్ద కాలువలోకి దూకిన బాలుడు
- ఆచూకీ కోసం గాలింపు



జీవన్

కడియం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అమ్మా! నేను కాలువలోకి దూకేస్తున్నానంటూ ఓ బాలుడు తన పుట్టినరోజునాడు.. తల్లికి ఫోనుచేసి కాలువలోకి దూకిన ఉదంతం వేమగిరిలో జరిగింది. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం.. కడియం మండలం బుర్రిలంక గ్రామానికి చెందిన పెదవేగి శ్రీను కుటుంబం ప్రస్తుతం వేమగిరి జగన్ కాలనీలో నివాసం ఉంటోంది. వీరి కుమారుడు జీవన్ కుమార్(16) కడియంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. మంగళవారం సాయంత్రం వేమగిరి కాలువ కాలిబాట వంతెన వద్దకు వెళ్లాడు. తల్లి గౌరీకి ఫోను చేసి నేను కాలువలోకి దూకేస్తున్నాను.. మీరు జాగ్రత్త! అంటూ కాలువలోకి దూకేశాడు. దీంతో జీవన్‌కుమార్ తల్లి స్పృహతప్పి పడిపోయింది. జీవన్ కాలువలో పడిపోయాడన్న విషయం తెలుసుకున్న స్థానికులు, స్నేహితులు అక్కడికి చేరుకున్నారు. జీవన్‌కుమార్ ఆచూకీ కోసం గాలిస్తున్నారు. కాగా తమకు ఎటువంటి ఫిర్యాదు రాలేదని సీఐ తెలిపారు.

మాటామాటా పెరిగి..



కొవ్వూరులో ఘర్షణ పడుతున్న తెలుగుదేశం, జనసేనకు చెందిన యువకులు, కార్యకర్తలు

- టీడీపీ, జనసేనలకు చెందిన యువకుల మధ్య ఘర్షణ.. కలబడి కొట్లాట
- సముదాయించిన టీడీపీ నేతలు, ఎమ్మెల్యే.. సర్దుబాటు చేసిన పోలీసులు
- ఇది కుర్రాళ్ల ఘర్షణ.. కూటమి పార్టీలకు ఆపాదించడం తగదు : ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): కొవ్వూరు టీడీపీ కార్యాలయంలో జనసేన, టీడీపీ కార్యకర్తల మధ్య జరిగిన ఘర్షణ కొద్దిపాటి ఉద్రిక్తతకు దారితీసింది. అయితే యువకుల మధ్య జరిగిన ఈ ఘర్షణను కూటమి పార్టీల వివాదంగా ఆపాదిస్తూ కొందరు ప్రచారానికి తెరదీశారు. కొవ్వూరు నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో సోమవారం రాత్రి టీడీపీ, జనసేన నాయకులు పార్టీ విషయాలపై చర్చించుకుంటున్నారు. ఈ సందర్భంలో పట్టణానికి చెందిన ఎం.శివకుమార్, బి.అనిల్ మద్యం సేవించి వచ్చారు. నాయకులు మాట్లాడుకుంటుండగా అక్కడకు వచ్చిన శివకుమార్ టీడీపీ, జనసేన గొడవలు మనకెందుకు అంటూ జోక్యం చేసుకోవడంతో అక్కడే కూర్చున్న జనసేన నాయకుడు, ఏఎంసీ డైరెక్టర్ గంగుమళ్ల స్వామి ఒక్కసారిగా పైకిలేచి శివకుమార్‌పై జనసేనని తిడతావా అంటూ చేయి చేసుకున్నాడు. దీంతో అక్కడున్న టీడీపీ కార్యకర్త, అతని అనుచరులు మా అన్నయ్యపై చేయి చేసుకుంటావా అంటూ ఒకరికొకరు కలబడ్డారు. అక్కడే ఉన్న టీడీపీ, జనసేన నాయకులు ఇరువర్గాలను వారించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాలను పంపించివేశారు. పార్టీ కార్యాలయం నుంచి స్వామిని ఇంటి వద్ద కారు దింపుతామంటే వినకుండా నడిచి దొమ్మేరు బయలుదేరాడు. కొవ్వూరు బస్టాండ్ సెంటర్‌లో యువకులు మళ్లీ స్వామిని అడ్డగించడంతో పోలీసులు ఇరువర్గాలను చెదరగొట్టారు. స్వామిని పోలీసు వాహనంలో దొమ్మేరు తరలించారు. అనంతరం దొమ్మేరు గ్రామంలో స్వామి ఇంటి వద్ద టెంటువేసుకుని జనసేన నాయకులతో బైఠాయించి న్యాయం చేయాలంటూ నిరసన వ్యక్తంచేశారు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు సంఘటనా స్థలానికి చేరుకుని జనసేన నాయకులతో మాట్లాడారు. సమస్యలుంటే పెద్దల సమక్షంలో మాట్లాడి సరిచేస్తానని హామీ ఇచ్చారు. మంగళవారం ఉదయం జనసేన నాయకులు నిడదవోలులో పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్‌ను కలిసి జరిగిన సంఘటనను వివరించారు. దీనిపై ఇరుపార్టీల పెద్దల సమక్షంలో కూర్చుని మాట్లాడి సమస్యలను పరిష్కారిస్తామని మంత్రి దుర్గేష్ చెప్పినట్టు సమాచారం. కాగా జనసేన నాయకుడు, ఏఎంసీ డైరెక్టర్ గంగుమళ్ల స్వామి మాట్లాడుతూ "గత మూడు రోజుల కిందట దొమ్మేరులో ఎల్‌వోసీ చెక్కు అందించడానికి ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, నాయకులు వచ్చారు. ఎమ్మెల్యే గ్రామానికి వచ్చిన తరువాత సమాచారం నాకు అందించారు. ఈ విషయం మాట్లాడడానికి సోమవారం రాత్రి స్నేహితుడిని తీసుకుని టీడీపీ పార్టీ కార్యాలయానికి వెళ్లాను. ఇదే విషయమై అక్కడ నాయకులతో మాట్లాడుతుండగా శివ అనే వ్యక్తి వచ్చి దుర్భాషలాడాడు. దీంతో అతని వెనక్కి గెంటాను. దీంతో అక్కడే ఉన్న టీడీపీ కార్యకర్తలు నాపై దాడిచేశారు. ఈ విషయాన్ని పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్‌కు తెలియజేశా. నియోజకవర్గ ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, అచ్చిబాబుల సమక్షంలో మాట్లాడతానని ఆయన తెలియజేశారని" స్వామి చెప్పారు.

మాట్లాడి సరిచేస్తాం..

కుర్రాళ్ల మధ్య జరిగిన ఘర్షణ ఇది. కొందరు కూటమి పార్టీలకు ఆపాదించడం సరికాదు. ఈ గొడవకు టీడీపీ, జనసేన పార్టీలకు ఎటువంటి సంబంధం లేదు. ఏదైనా సమస్యలుంటే ఇరుపార్టీల పెద్దల సమక్షంలో మాట్లాడి సరిచేస్తాం.

- ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

వైసీపీ అన్నదాతపోరుకు రైతుల కొరత



రాజమహేంద్రవరంలో నిరసన వ్యక్తం చేస్తున్న వైసీపీ నాయకులు, కార్యకర్తలు

రాజమహేంద్రవరంలో ఆందోళన.. కొవ్వూరులో ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం

రాజమహేంద్రవరం,సెప్టెంబరు9 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అన్నదాత పోరుకు రైతులు కరవయ్యారు. రైతుల నుంచి స్పందన కనిపించలేదు. వైసీపీ మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, వైసీపీకి చెందిన నాయకులు మాత్రమే హాజరయ్యారు. యూరియాతోపాటు ఎరువుల కొరత ఉందని, ఎరువులు బ్లాక్ మార్కెట్ చేస్తున్నారని ఆరోపిస్తూ నేతలు విమర్శలు చేశారు. రాజమహేంద్రవరంలో రాజానగరం మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఇంటి వద్ద మాజీ మంత్రి చెల్లుబోయిన వేణు, మాజీ ఎమ్మెల్యేలు జక్కంపూడి రాజా, డాక్టర్ సత్తి సూర్యానారాయణరెడ్డి, సీనియర్ నేతలు డాక్టర్ గూడూరి శ్రీనివాసరావు, చందన నాగేశ్వర్, మేడపాటి షర్మిళారెడ్డి తదితర నాయకులు పలువురు వైసీపీ కార్యకర్తలు, చోటామోటా నేతలతో కలసి ప్రదర్శనగా ఆర్డీవో కార్యాలయానికి వెళ్లి వినపత్రం ఇవ్వాలని బయలుదేరగా, పోలీసులు అడ్డుకున్నారు. సెక్షన్ 30 అమలులో ఉన్నందున ఇలా ఎక్కువమంది వెళ్లడానికి వీలులేదని, నలుగురైదుగురు వెళ్లి వినతిపత్రం ఇవ్వవచ్చని చెప్పారు. అయినా దూసుకెళ్లడానికి ప్రయత్నించగా, పోలీసులు అడ్డుకోవడంతో రోడ్డు మీదే బైఠాయించి, ప్రభుత్వం, సీఎం చంద్రబాబుకు వ్యతిరేకంగా నినాదాలిచ్చారు. నలుగురైదుకు వెళ్లి ఆర్డీవోకు వినతిపత్రం ఇచ్చే అవకాశం ఉన్నప్పటికీ ఎవరూ వెళ్లకపోవడం గమనార్హం. కొవ్వూరులో మాజీ మంత్రి తానేటి వనిత, మాజీ ఎమ్మెల్యేలు తలారి వెంకట్రావు, జి.శ్రీనివాసనాయుడు ఆందోళనచేసి ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రమిచ్చారు.



గౌరీపట్నంలో అధికారులకు ఆదేశాలు ఇస్తున్న జిల్లా కలెక్టర్ ప్రశాంతి

నానో యూరియా వినియోగంపై

రైతులు దృష్టి పెట్టాలి

● జిల్లా కలెక్టర్ ప్రశాంతి

దేవరపల్లి, సెప్టెంబరు9 (ఆంధ్రజ్యోతి): నానో యూరియా వినియోగంపై రైతులకు అవగాహన అవసరమని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి పేర్కొన్నారు. మండలంలోని యర్నగూడెం సొసైటీ కార్యాలయంలో యూరియా వినియోగం, సరఫరాపై క్షేత్రస్థాయిలో వ్యక్తిగతంగా పరిశీలన చేయడం, రైతులకు అవగాహన కల్పించటం అధికారులు చర్యలు తీసుకోవాలని ఆమె పేర్కొన్నారు. యూరియా, నానో యూరియా సేంద్రియ ఎరువులపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా సమావేశానికి హాజరైన కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ జిల్లాలో యూరియా సమృద్ధిగా ఉన్నప్పటికీ తక్కువ పెట్టుబడులతో ఎక్కువ దిగుబడిని ఇచ్చే నానో యూరియా వినియోగంపై రైతులు దృష్టిపెట్టాలన్నారు. ఇప్పటివరకు రైతు సేవా కేంద్రాలు సహకార పరపతి సంఘాలు, ప్రైవేటు డీలర్ల ద్వారా మొత్తం 23129 మెట్రిక్‌టన్నుల యూరియా సరఫరా చేశామన్నారు. గత సంవత్సరం 2024 సెప్టెంబర్ నెలాఖరుకి 19వేల మెట్రిక్ టన్నులు మాత్రమే విక్రయించగా ఈ ఏడాది జిల్లాలో ఇప్పటివరకు 23వేల 129 మెట్రిక్ టన్నులు విక్రయాలు అయ్యాయని తెలిపారు. అదనంగా మరో 2600 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉన్నాయ న్నారు. దేవరపల్లి మండల పరిధిలో 2024 ఖరీఫ్ సీజన్‌లో 1799 మెట్రిక్ టన్నులు సరఫరా కాగా, ప్రస్తుతం 2025 ఖరీఫ్ సీజన్‌లో 1500మెట్రిక్ టన్నులు విక్రయించామన్నారు. కొన్ని ప్రాంతాల్లో నాట్లు ఆలస్యంగా వేయడం వలన అక్టోబర్ నెల వరకు యూరియా వినియోగం కొనసాగుతుందని ఆ మేరకు దశలవారీగా సరఫరా చేస్తున్నామని తెలిపారు. క్షేత్రస్థాయిలో అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేస్తూ రైతులకు సరఫరా నిరాటంకంగా కొనసాగించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. జిల్లాలో తగినంత యూరియా నిల్వలు ఉన్నాయని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. అక్టోబర్ చివరి వరకు యూరియా సరఫరా కొనసాగు తుందన్నారు. రైతులు అవసరానికి అనుగుణం గానే వినియోగించుకోవాలని తొందరపడి అదనపు నిల్వలు చేయకుండా చూసుకోవాల న్నారు. ఏ దశలో ఎంతమేర యూరియా విని యోగం చేయాలో రైతులు అవగాహన కలిగి ఉందని అవసరం మించియూరియా వినియో గంవలన పంటకు ప్రయోజనం కంటే భూమికి పంటకు ఎక్కువ నష్టం కలుగుతుందన్నారు. సాధారణ యూరియాతో పోలిస్తే నానో యూరియా వినియోగం పంటల ఉత్పత్తులు పెంచుటమే కాకుండా భూసారం కాపాడుతుంద న్నారు. నానో యూరియా వలన ఖర్చు కూడా తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఎస్.మాధవరావు, జిల్లా సహకార అధికారి ఎం.వెంకటరమణ, జిల్లా కో ఆపరేటివ్ ఉద్యానశాఖ అధికారి మల్లిఖార్జునరావు, గౌరీపట్నం సొసైటీ చైర్‌పర్సన్ ఆండ్రూ అనిల్, దేవరపల్లి సొసైటీ చైర్‌పర్సన్ ఉప్పులూరి రామారావు, వ్యవసాయాధికారి కే. కమల రాజు, ఎంపీడీవో వై.రాజారావు పాల్గొన్నారు.

యూరియా వాడకంపై అవగాహన

తాళ్లపూడి(ఆంధ్రజ్యోతి): అధిక మొత్తంలో యూరియా వాడకంవల్ల భూమి తన శక్తిని కోల్పోతుందని రైతులు మాత్రం ఒకరిని చూసి మరొకరు అధిక మొత్తంలో యూరియా వాడుతున్నారని వ్యవసాయాధికారిణి రుచిత అన్నారు. మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో యూరియా వాడకంపై ఐకేపీ ఏపీఎం మంగాయమ్మ ఆధ్వర్యంలో సీఆర్‌పీలకు, ఎఫ్‌ఈజీ ఫార్మా మిత్రాలకు, వీఏవోలకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఏపీవో మంగాయమ్మ మాట్లాడుతూ యూరియా ఎక్కువ వాడకం వలన కలిగే నష్టాల గురించి మహిళా సంఘాలకు అవగాహన కలిపించి దీనిపై గ్రామస్థాయిలో ఉండే డ్వాక్రా మహిళలకు అవగాహన కల్పించడానికి ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో ఏవో రుచిత మాట్లాడుతూ రైతులు అధిక మొత్తంలో యూరియా వాడకం ఎక్కువ చేస్తున్నారన్నారు. ప్రస్తుతం మండలంలో రైతులకు ఎటువంటి యూరియా కొరత లేదన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ జిల్లా ఎగ్జిక్యూటివ్ వరలక్ష్మి, ప్రకృతి వ్యవ సాయ సిబ్బంది, సమీకృత వ్యవసాయ సీఆర్‌పీలు, ఫార్మా మిత్రాలు, మండల సమాఖ్య మహిళా సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐకేపీ ఏపీఎం మంగాయమ్మ

అవసరం మేరకే ఎరువులు వాడాలి

ఉండ్రాజవరం(ఆంధ్రజ్యోతి): అవసరం మేరకే రసాయనిక, సేంద్రియ, జీవన ఎరువులు వాడాలని డీఆర్‌డీఏ పీడీ ఎంవీఎస్ మూర్తి పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అధిక మోతాదులో యూరియా వాడకం వలన కలిగే అనర్థాలను గురించి మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయంలో డ్వాక్రా మహిళలకు అవగాహన కార్యక్రమం తహసీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తమ పొలాల్లో భూసార పరీక్షలకు అనుగుణంగా ఎరువులు వాడాలని సూచించారు. ఏవో రాజారావు మాట్లాడుతూ పరిమితి మించి యూరియా వాడటంవలన పైరు అధికంగా పెరిగి చీడపీడలకు పంట గురవుతున్నట్లు చెప్పారు. నానో ఎరువులు వాడకాన్ని పెంచేలా డ్వాక్రా మహిళలు రైతులకు గ్రామాల్లో అవగాహన కల్పించాలని ఏవో రాజారావు కోరారు. కార్యక్రమంలో ఏపీఎం బాలకోటయ్య, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

వరి సాగులో సస్యరక్షణ చర్యలు పాటించాలి

వరిసాగులో రైతులు సస్యరక్షణ చర్యలు పాటించాలని ఏవో బి.రాజారావు పేర్కొన్నారు. మండలంలోని చివటం, వడ్లూరు గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో రాజారావు రైతులతో మాట్లాడారు. వరిసాగులో రైతులు నారుమడుల నుంచి వరికోతలు వరకు సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నా రు. ఎరువులు తగు మోతాదులో వాడాలన్నారు. వివిధ అంశాలపై రైతులకు ఏవో వివరించారు. కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.



నిడదవోలులో కోట సత్తెమ్మ తిరునాళ్ల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి దుర్గేష్

కోట సత్తెమ్మ తిరునాళ్ల పోస్టర్ ఆవిష్కరణ

నిడదవోలు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కోట సత్తెమ్మ ఆలయంలో జరిగే దసరా వేడుకల్లో భక్తులకు మెరుగైన సేవలు అందించాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ అధికారులను ఆదేశించారు. మంగళవారం నిడదవోలులో కోట సత్తెమ్మ అమ్మవారి దేవ స్థానంలో జరగనున్న దసరా వేడుకలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ ఈనెల 22నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు జరుగనున్న దసరా మహోత్సవాలు ఆలయంలో ఘనంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో దేవస్థానం సహాయ కమిషనర్ మరియు కార్య నిర్వహణాధికారి వి.హరిసూర్య ప్రకాష్, అలయ అర్చకుడు అప్పారావుశర్మ, పాల్గొన్నారు.

జాతీయ లోక్‌అదాలత్‌లో

ఎక్కువ కేసులు రాజీ చేయాలి

● కొవ్వూరు సీనియర్ సివిల్ జడ్జి జి.వి.ఎల్.సరస్వతి



పోలీసు అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి సరస్వతి

కొవ్వూరు, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఈనెల 13వ తేదీన జరుగనున్న జాతీయ లోక్‌అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ అయ్యేలా చర్యలు తీసుకోవాలని కొవ్వూరు సీనియర్ సివిల్ జడ్జి జి.వి.ఎల్.సరస్వతి అన్నారు. మంగళవారం కొవ్వూరు కోర్టుహాలులో డివిజన్ పరిధిలోని పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. కొవ్వూరు కోర్టులలో ఎన్ని కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఎన్ని కేసులు రాజీకి గుర్తించారు. ఎక్కువ కేసులు రాజీమార్గంలో పరిష్కరించి, పెండి ంగ్ కేసులు తగ్గించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి జి.సాయికృష్ణ, సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ కె.నాగలక్ష్మి, డిఎస్‌పి జి.దేవకుమార్, కొవ్వూరుపట్టణ, రూరల్, దేవరపల్లి, తాళ్లపూడి, గోపాలపురం ఎస్‌ఐలు, కోర్టు కానిస్టేబుల్‌లు పాల్గొన్నారు.

విజయగణపతిని దర్శించుకున్న గోపాలకృష్ణ



విజయ గణపతిని దర్శించుకుంటున్న, సుందరపల్లి గోపాలకృష్ణ, నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ యానాపు యేసు

కొవ్వూరు, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): కొవ్వూరు మండలం వేములూరు విజయగణపతి ఆలయంలో వినాయకచవితి వేడుకలను పురస్కరించుకుని అన్నదానం చేశారు. ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ గత 42 సంవత్సరాలుగా గ్రామంలో నవరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు.మంగళవారం సుమారు 3వేల మంది భక్తులకు అన్నదానంచేశారు. అనంతరం వేలంపాటలో వినాయకుని చేతి లో ఉంచిన 61కేజీల లడ్డూని గ్రామానికి చెందిన మేడూరి పిర్లస్వామి మనుమడు సౌరాన్ష్ రూ.17,500లకు 5 కేజీల మరో లడ్డూని పెదపూడి అమ్మిశెట్టి రూ.8,100కు పాడుకున్నారు. ఉత్సవాలలో పాల్గొన్న ధన్వంతరి నాయీబ్రాహ్మణ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షు డు సుందరపల్లి గోపాలకృష్ణ, నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ యానాపు యేసులను ఆలయకమిటీ సభ్యులు సత్కరించారు.



రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి మృతి

పెరవలి, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): తణకు జాతీయ రహదారిపై కడింపాడువద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం కోనసీమ జిల్లా రావులపాలెం మండలం రావులపాడుకు చెందిన కొప్పిశెట్టి వెంకాయమ్మ (68) అనే మహిళ మంగళవారం ఉదయం తన బంధువుల ఇంటికి వెళ్లేటపుడు పెరవలి మండలం కడింపాడు సెంటర్‌వద్ద ఆటోలో వచ్చి దిగింది. రోడ్డు దాటుతుండగా రోడ్డుపై వెళ తున్న ఒక మోటారు సైకిల్ ఆమెను బలంగా ఢీ కొట్టింది. ఆమెకు తీవ్ర గాయం కాగా చికిత్స నిమిత్తం తణుకు ఆసుపత్రిలో చేర్చారు. మెరుగైన వైద్యం కోసం వేరే ఆసుపత్రికి తరలించగా మరణించింది. ఆమె కుమారుడు కొప్పిశెట్టి వీరభద్రం ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటేశ్వరరావు తెలిపారు.

రాష్ట్రవ్యాప్తంగా యూరియా కొరత

● అన్నదాత పోరుబాట కార్యక్రమంలో మాజీ మంత్రి వనిత



తహసీల్దార్ దాసరి అచ్యుతకుమారికి వినతిపత్రం అందజేస్తున్న వైసీపీ నాయకులు

కొవ్వూరు, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా రైతాంగం యూరియా కొరతతో ఇబ్బందులు పడుతున్నారని మాజీ హోంమంత్రి తానేటి వనిత విమర్శించారు. మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ఆధ్వర్యంలో కొవ్వూరు పట్టణంలో అన్నదాత పోరుబాట కార్యక్రమాన్ని చేపట్టారు. మంగళవారం కొవ్వూరు మెరకవీధి వాటర్‌ట్యాంకు నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు ఫ్లకార్డులు ధరించి నినాదాలు చేస్తూ నిరసన ప్రదర్శన చేపట్టారు.అనంతరం ఆర్డీవో కార్యాలయంలో కెఆర్‌సీ తహసీల్దార్ దాసరి అచ్యుతకుమారికి వినతిపత్రం అందజేశారు. రైతులకు యూరియాను సకాలంలో అందించాలని, పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. మాజీ హోంమంత్రి తానేటి వనిత మాట్లాడుతూ యూరియా బ్లాక్ మార్కెట్‌లో రూ.400లకు అమ్ముతూ రైతులపై అదనపు భారం మోపుతున్నారు. పండించిన పంటకు గిట్టుబాటు ధర అందించడం లేదు. ఇబ్బందులు కలిగాయని విద్యార్థులు, రైతులు తెలియజేయడానికి లేకుండా నియంతపాలన కొనసాగిస్తున్నారన్నారు. సీఎం చంద్రబాబు స్వయంగా బెదిరింపు మాటలు మాట్లాడడం బాధాకరమన్నారు. రైతుల ఇబ్బందులు మాట్లాడిన, నిరసన తెలిపినవారిపై కేసులు పెడుతున్నారన్నారు. వైసీపీ నాయకులపై అక్రమ కేసులు పెడుతున్నారు. రైతులకు యూరియాను సకాలంలో అందించాలని, పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు తలారి వెంకట్రావు, జి.శ్రీనివాసనాయుడు, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కంటమణి రమేష్‌బాబు, కోడూరి శివరామకృష్ణ, గిరిజాల బాబు, ఎంపీపీలు దుర్గారావు, పోసిరాజు, నాయకులు ఎల్ఎన్‌టి సుబ్రహ్మణ్యం, కూచిపూడి సతీష్, వెలగ శ్రీరామమూర్తి, నాయకులు పాల్గొన్నారు.

నిరసనవారం ఉద్యమ కార్యాచరణను

విజయవంతం చేయాలి

● ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో నిరసన



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు దున్నా దుర్గారావు

తాళ్లపూడి, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు రావాల్సిన బకాయిలు చెల్లించటంలో ప్రభుత్వం దాటవేత ధోరణిని నిరసిస్తూ ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో నిరసనవారం ఉద్యమ కార్యాచ రణను విజయవంతం చేయాలని తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు దున్నా దుర్గారావు అన్నారు. ఆయన మంగళవారం మండలంలోని పెద్దేవం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసి సమావేశంలో మాట్లాడుతూ గత ప్రభుత్వం అనేక హామీలు ఇచ్చి ఉపాధ్యాయులను రివర్స్ పీఆర్‌సీతో మోసం చేసినట్లే నేటి కూటమి ప్రభుత్వం కూడా 15 నెలలు గడుస్తున్నా ఇచ్చిన హామీలు అమలుచేయడంలో బకాయిలు చెల్లించడంలో జాప్యం చేస్తూ గత ప్రభుత్వ బాటలోనే నడుస్తోందన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల సంక్షేమానికి పెద్ద పీట వేస్తున్న ప్రభుత్వం మాది అంటూనే పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏ(కరువుభత్యం)లు ఎప్పుడు విడుదల చేస్తారో చెప్పడం లేదన్నారు. ఉపాధ్యాయులే నా బలం అంటూనే బోధనేతర పనులతో ఇబ్బందులు పెడుతున్నారని అన్నారు. 15 నెలలుగా వేచి చూశామని పేరుకుపోయిన అన్ని బకాయిలనూ వెంటనే చెల్లించాలని ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా రాష్ట్రకమిటీ నిరసన వారం ప్రకటించిందని అన్నారు. దానిలో భాగంగా ఈనెల 11వ తేదీన నల్ల రిబ్బన్లతో విధులకు హాజరుకావాలని 12న మండల కేంద్రాలలో ఉపాధ్యాయుల నిరసన ప్రదర్శన చేయాలని, 13, 14న ప్రజాప్రతి నిధులకు మెమోరాండం సమర్పించాలని, 15న తాలూకా కేంద్రాలలో, 16న జిల్లా కేంద్రాలలో నిరసన ప్రదర్శనలు చేయాలని, 17న ముఖ్య మంత్రి వాట్సాప్‌కు సందేశాలు పంపుతామ న్నారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు పా ల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రాజేష్, రమాదేవి, శాంకుమారి, పద్మావతి, మధులత, ప్రసన్నలక్ష్మి, కుమార్, ఏపీటీఎఫ్ నాయకులు రాజారత్నం, కృష్ణలు పాల్గొన్నారు.

పాఠశాలలను తనిఖీ చేసిన మండల అకడమిక్ ఫోరమ్ సభ్యులు

బిక్కవోలు, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు పాఠశాలలను మంగళవారం మండల అకడమిక్ ఫోరమ్ సభ్యులు తనిఖీ చేశారు. ఈసందర్భంగా ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను వేర్వేరు బృందాలు తనిఖీ చేశాయి. బిక్కవోలులో పాఠశాలలను తనిఖీలు చేశా. ఈసందర్భంగా వీరు విద్యార్థుల వర్క్‌బుక్స్, ఎఫ్‌ఏ-1 అసెస్‌మెంట్ బుక్స్, టీచర్స్ హేండ్ బుక్స్, టీఎల్‌ఎమ్, విద్యాప్రవేశ్, ఎఫ్ఎల్ఎన్, లీప్ యాప్, ప్రతి శనివారం నిర్వహించే నోబ్యాగ్‌డే కృత్యాలు, డైరీ ప్రాక్టీస్ రైటింగ్ వంటి వాటని పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు అందజేశారు. విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యాలు మెరుగుపరచేందుకే ఈతనిఖీలు నిర్వహిస్తున్నామని ఎంఈవో సీహెచ్‌వీవీ. సత్యనారాయణ తెలిపారు. కాంప్లెక్స్ హెచ్ఎం వీవీ ప్రభాకరరావు, గెజిటెడ్ హెచ్ఎం పి.శ్రీనివాసరెడ్డి, ఏడుగురు సబ్జెక్ట్ టీచర్లు, ఐదుగురు ఎస్‌జీటీలు ఈతనిఖీల్లో పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ల కుటుంబాలను ఆదుకోవాలి

● యూనియన్ నాయకుల నిరసన



కొవ్వూరు: పంగిడిలో నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న ఆటో యూనియన్ నాయకులు

కొవ్వూరు, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఫ్రీ బస్సు పథకంతో ఉపాధికోల్పోయిన ఆటో కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని స్వర్ణాంధ్ర ఆటో యూనియన్ ప్రెసిడెంటు కొనాలి శేఖర్ అన్నారు. కొవ్వూరు మండలం పంగిడి గ్రామంలో స్వర్ణాంధ్ర ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లు మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. యూనియన్ ప్రెసిడెంటు కొనాలి శేఖర్ మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలకు ఉచిత బస్సు పథకంతో ఆటో డ్రైవర్ల పరిస్థితి అగమ్యగోచరంగా తయారయ్యాయి. ఉపాధి కోల్పోయి పిల్లల స్కూల్ ఫీజులు , కరెంటు బిల్లులు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఆటో కార్మికుల ఆవేదనను ప్రభుత్వం ఆలోచన చేయాలన్నారు. ఫ్రీ బస్సు పథకానికి వ్యతిరేకం కాదు. ఉపాధి కోల్పోయిన ఆటో డ్రైవర్ల కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. ఆటో డ్రైవర్లకు ఆహారభద్రత, ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. కాపవరం ఆటో యూనియన్ ప్రెసిడెంట్ వరిగేటి సోమరాజు, చౌటిపల్లి వీరన్న, ఎం.గంగరాజు, జంపా దుగ్గ య్య, పంగిడి, కాపవరం, చాగల్లు, ఊనగట్ల, నిడదవోలు మ్యాజిక్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్‌లను ప్రభుత్వమే ఆదుకోవాలి

చాగల్లు(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత బస్సు పథకంతో ఆటో డ్రైవర్‌లు తీవ్రంగా నష్టపోతున్నారని వారిని ఆదుకోవాలని కోరుతూ మంగళవా రం నిరసన కార్యక్రమం నిర్వహించారు. జై విజయదుర్గ ఆటో ఓనర్స్ అండ్ ఆటో డ్రైవర్స్ హెల్పర్స్ అసోసియేషన్ ఆధ్వర్యం లో చాగల్లు మెయిన్‌రోడ్డుపై నిరసన ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ ఎం.మెరికమ్మను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం యూనియన్ అధ్యక్షుడు ఎండీ తాజుద్దీన్ బేగ్ మా ట్లాడుతూ స్రీశక్తి పథకంలో ఉచిత బస్సు వలన ఆటో డ్రైవర్‌లు ఉపాధి కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆటో డ్రైవర్‌లకు కార్పొరేషన్ ఏర్పాటు చేసి సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకుడు పుల్లూరి సత్యనారాయణ, నాయకులు కంచుమర్తి ధర్మరాజు, అంజిత్ శ్రీనివాసరావు, మల్లుల మల్లిఖార్జునరావు, కంచుమర్తి సుబ్రహ్మణ్యం, ఇరుగుల గోపి పాల్గొన్నారు.

తాళ్లపూడి(ఆంధ్రజ్యోతి) : గతంలో ఆటోలను ప్రవేశపెట్టి అన్నం పెట్టిన నాయకులే నేడు నోటి దగ్గర కూడునే లాగేసుకుంటూ వేలాది ఆటో కార్మికుల కుటుంబాలను రోడ్డు పాలు చేస్తున్నారని మహిళలకు ఫ్రీ బస్సు పథకం ప్రవేశ పెట్టి ప్రస్తుత ప్రభుత్వం తమ నోట్లో మట్టికొడుతూ జీవనోపాధి లేకుండా చేసిందని పలువురు ఆటో యూనియన్ నాయకులు అన్నారు. మండలంలోని ప్రక్కింలక, పైడిమెట్ట గ్రామాల జంక్షన్‌లోని బాబూ జగజ్జీవన్‌రామ్ విగ్రహంవద్ద మండలంలోని పలు ఆటో యూనియన్‌ల ఆధ్వర్యంలో మంగళవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యా లయంలో ఆర్ఐ రామకృష్ణకు వినతి పత్రం అందించారు. ఈ నిరసన కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు కడుగుల రజనీకుమార్, తమిర్చి మధుబాబు, హనుమంతు, నెప్రహా సుమారు 300ల మంది ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.



చాగల్లు తహసీల్దార్ మెరికమ్మకు వినతి పత్రం అందజేస్తున్న ఆటో యూనియన్ నాయకులు



తాళ్లపూడిలో నిరసన వ్యక్తం చేస్తున్న ఆటో డ్రైవర్లు

వివాహిత అదృశ్యం



పెరవలి, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఖండవల్లికి చెందిన ఒక వివాహిత అదృశ్యమైనట్లు పోలీసులకు ఫిర్యాదు అందింది. దీనికి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. ఖండవల్లికి చెందిన వనచర్ల రాంబాబు, లక్ష్మి దంపతుల కుమార్తె అయిన జోష్న (19) అనే ఆమెకు గత ఏప్రిల్ 23న వివాహం అయ్యిం ది. వినాయకచవితి సందర్భంగా పుట్టింటికి వచ్చిన ఆమె ఖండవల్లిలోనే ఉంటుంది. ఈ నెల 8వ తేదీ ఉదయం తల్లిదండ్రులు కూలీ పనులకు వెళ్లగా ఆమె ఇంటి వద్దనే ఉంది. వారు తిరిగి వచ్చే సమయానికి ఆ అమ్మాయి ఇంటిలో కనిపించక పోవడంతో చుట్టుపక్కల వెతికినా ప్రయోజనంలేక పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మానసికోల్లాసానికి క్రీడలు దోహదం

● పశ్చిమగోదావరి జిల్లా టెన్నికాయిట్ అధ్యక్షుడు గన్నమని హరికృష్ణ



రామన్నపాలెంలో క్రీడలు ప్రారంభిస్తున్న జిల్లా టెన్నికాయిట్ అధ్యక్షుడు హరికృష్ణ, ఎంపికైన బాలికల జట్టు

దేవరపల్లి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): క్రీడలు మానసికోల్లాసా నికి, శారీరక ధృడత్వానికి ఎంతో దోహదపడతాయని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా టెన్నికాయిట్ అధ్యక్షుడు గన్నమని హరికృష్ణ పేర్కొన్నారు. దేవరపల్లి మండలం రామన్నపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మంగళవారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా సీనియర్ టెన్నికాయిట్ జట్టు క్రీడా పోటీలు నిర్వహించారు. రామన్న పాలెం హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు, క్యాబ్ డైరెక్టర్ పేరం రవీంద్రనాథ్ ఆధ్వర్యంలో ఈ క్రీడాపోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 60మంది పాల్గొన్నారని వీరిలో బాలికలుజిల్లా జట్టులో ఎంపికచేస్తామని తెలిపారు. పురుషుల నుంచి నలుగురు, బాలికల నుంచి నలుగురిని ఎంపిక చేస్తామన్నారు. ఎంపికైన జట్టు రాష్ట్ర స్థాయి పోటీలకు ఈనెల 13, 14 తేదీల్లో మండపేటలో జరిగే పోటీల్లో పాల్గొం టాయని తెలిపారు. ఈ క్రీడాకారులకు క్రీడాదుస్తులను జిల్లా టెన్నికాయిట్ జిల్లా అధ్యక్షుడు గన్నమని హరికృష్ణ, కార్యదర్శి ఉప్పులూరి రామారావులు అందజేశారు. కార్యక్రమంలో క్రీడా కార్యదర్శులు గద్దే చంద్రశేఖర్, ఆచంట వెంకటేశ్వరరావు, రామన్నపాలెం పీఈటీ తలారి సరస్వతి, మండల టీడీపీ అధ్యక్షుడు ఆండ్రూ అనిల్, టీడీ పీ నాయకులు పరిమి శ్రీరామకృష్ణ, ముమ్మారెడ్డి సత్యనారాయణ, కాత్రగడ్డ రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు. టెన్నికాయిట్‌కు ఎంపికైన బాలుర జట్టు బీ.చంటిబాబు, జీ.చంద్ర మహేశ్, రాపాక నవీన్, అద్దాల అజయ్, గారపాటి బాబీ, సీనియర్ బాలికల జట్టు, జీ.మాధురి, రాపాక సంస్కృతి, ఎస్‌కే. లలిత, మిరియాల ప్రియదర్శిని, ఆర్.సంస్కృతి పాల్గొన్నారు.